జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528



కృష్ణ | మంగళవారం 14 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :181 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: అమావాస్య, వటసావిత్రి వ్రతం, జ్యేష్ఠ అమావాస్య, గురుమౌఢ్యమి ప్రారంభం సూర్యోదయం: 5:34 , సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: లేదు , చంద్రాస్తమయం: 6:40 తిథి: అమావాస్య సా. 4:04 వరకు, తదుపరి పాడ్యమి, నక్షత్రం: పునర్వసు రా. 2:12 వరకు, తదుపరి పుష్యమి యోగం: వ్యాఘాతం మ. 2:00 వరకు, తదుపరి హర్షణ, కరణం: నాగవ సా. 4:04 వరకు, తదుపరి కింస్తుఘ్న రా. 2:56 వరకు, తదుపరి బవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com


## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?



- పీయూశ్ గోయల్ ఇచ్చిన క్లారిటీ ఇదే!
- "అవన్నీ అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించే వార్తలు"
- భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడిందనే వార్తలను ఖండించిన కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

- దబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్‌ను అవమానిస్తున్నారు.. కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**కొత్తపేట/ఆత్రేయపురం**

గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల - మిగతా3లో

## ఏపీలో ముగింపు దశకు ఓటర్ల జాబితా సవరణ



- గడువు పొడిగించాలని ఈసీకి సీఈవో లేఖ
- రాష్ట్రంలో పూర్తయిన 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ
- చనిపోయినట్లుగా 14 లక్షల మందికి పైగా ఓటర్ల గుర్తింపు
- శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 12 లక్షలకు పైనే

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. గత నెల రోజుల నుంచి జరుగుతున్న ఈ ప్రక్రియలో గణనీయమైన పురోగతి కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అయితే, వివిధ రాజకీయ పార్టీల వినతుల మేరకు ఈ ప్రక్రియ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో నెల రోజుల నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) - మిగతా3లో



## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

- రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!
- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం



## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్?

- జాబితాలో ట్రంప్, మెలోనీ, మెక్రాన్ పేర్లు!
- అమెరికా, యూరప్ నేతలే లక్ష్యంగా హిట్‌లిస్ట్ ప్రచురించిన ఇరాన్ పత్రిక
- అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగానే ఈ జాబితా అంటూ ప్రకటన
- ప్రతీకారం తీర్చుకుంటామని, నేరస్థుల జాబితా సిద్ధంగా ఉందని మొజ్తబా ఖమేనీ హెచ్చరిక
- జాబితాలో ట్రంప్, నెతన్యాహు, మెక్రాన్ సహా 13 మంది ప్రముఖులు

# చిన్నారుల కేంద్రాలకు కొత్త చిగురు

- కొత్తగా అందుబాటులోకి రానున్న 4,794 అంగన్వాడీ భవనాలు
- వైఎస్సార్సీపీ నిర్లక్ష్యంతో వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణ పనులు
- అవసరమైన నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశం
- కొత్తగా 1864 భవనాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం



**అమరావతి**

రాజకీయ కారణాలతో నిలిచిపోయిన అంగన్వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం ఊపిరి పోయనుంది. అభివృద్ధియే ముఖ్యమంటూ ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనే కక్షతో 2019-24 మధ్య జగన్ నిలిపేసిన 2,930 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని నిర్ణయించింది. దీనికి వీబీ జీరామ్ జీ పథకాన్ని అనుసంధానిస్తారు. వీటితోపాటు కొత్తగా 1,864 భవనాలను నిర్మిస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. వీటికి అవసరమైన నిధులను విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ఇవి పూర్తయితే 4,794 భవనాలు కొత్తగా సమకూరుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 55,754 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, అందులో 23,407 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. విడతల వారీగా శాశ్వత - మిగతా3లో


## పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



**విజయవాడ**

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) పరిధిలోని విజయవాడ ఆటో నగర్ ప్రాంతంలో 'చెత్త సేకరణ, బదిలీ కేంద్రం' (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటుకు అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించాలని ఏపీఐఐసీ, ఐఏఎల్ఏ అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర లేఅవుట్ ప్లాన్, ఇంజనీరింగ్ డిజైన్, అంచనా వ్యయం, ఇతర ప్రాజెక్ట్ పత్రాల తయారీకి సాంకేతిక సహాయం కోరుతూ ఏపీఐఐసీ సంస్థ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదన పంపాలని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు తక్షణ చర్యలు - మిగతా3లో



## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

- కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్
- హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



## 'ఎస్-500' వచ్చేస్తోంది!

- భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..
- ఇక చైనా, పాకిస్తాన్‌కు చుక్కలే..!
- భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం
- దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'



## ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

- పోక్సో దుర్వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రేమలో ఉన్న టీనేజీ యువతపై పోక్సో చట్టం దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు ఆందోళన
- ఆ జంట పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదని ప్రశ్న
- కుటుంబ పరువు కోసం తల్లిదండ్రులు కేసులు పెడుతున్నారని వ్యాఖ్య

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?



భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన (డెడ్ లాక్) ఏర్పడిందనే వార్తలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఖండించారు. "ఆ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేవి" అని పేర్కొన్నారు. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకునేందుకు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి బదులుగా, మరింత మెరుగైన ఒప్పందం కోసం భారత్ చర్చలను ఆలస్యం చేస్తోందని ఒక అంతర్జాతీయ వార్త సంస్థ కథనాన్ని ప్రచురించింది. దీనిన్ని పీయూశ్ గోయల్ ఎక్స్ వేదికగా ఖండించారు. ఆ వార్త పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేది అని అన్నారు. జూన్ నెలలో యూఎస్ వాణిజ్య ప్రతినిధి (యూఎస్?టీఆర్) జేమీసన్ గ్రీర్ దిల్లీ సందర్శించినప్పుడు ఆయనతో 'ఫెంటాస్టిక్ మీటింగ్స్?' జరిగాయని తెలిపారు. ఇరుదేశాలు సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు.

"జూన్ నెలలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసర్ గ్రీర్? దిల్లీ వచ్చినప్పుడు ఆయనతో అద్భుతమైన సమావేశాలు జరిపాను. ఇరుదేశాల్లోని వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలను అందించే, వాణిజ్యపరంగా అర్థవంతమైన, సమతుల్యమైన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి మా బృందాలు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాయి" అని గోయెల్ పేర్కొన్నారు. భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందానికి ఎలాంటి అడ్డంకులు లేవని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్ తెలిపిన తర్వాత కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

**అంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది!**

2026 జూన్? వాణిజ్య గణాంకాలపై మీడియా ప్రతినిధులతో మాట్లాడిన రాజేశ్ అగర్వాల్?, భారత్?-అమెరికా ట్రేడ్ డీల్? చర్చల్లో తమకు ఎలాంటి సవాళ్లు కనిపించలేదని పేర్కొన్నారు. "భారత బృందం మే నెలలో అమెరికాను సందర్శించింది. యూఎస్? బృందం జూన్?లో భారత్?కు వచ్చింది. చర్చలు సరైన పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. అమెరికా సుంకాల (టారిఫ్స్?) బాదుడు చర్యలపై చాలా మంది భాగస్వాములకు అనిశ్చితి ఉంది. అయితే ఇప్పుడు ఐఈఈపీఏ సుంకం ముగిసింది. అమెరికా వాళ్లు ఇప్పుడు మళ్లీ ఇతర దేశాలతో చర్చలు జరుపుతున్నారు. భారత్ కూడా ఆ చర్చల్లో భాగస్వామిగా ఉంది. ఈ వాణిజ్య ఒప్పందంపై చర్చలన్నీ సరైన దిశలోనే వెళ్తున్నాయి. ఇప్పటికే డీల్ ఫ్రేమ్?వర్క్? ఖరారైంది. మేము ఈ ట్రేడ్ డీల్?పై సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ప్రాథమిక పనులన్నీ పూర్తయ్యాయి. సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం. అన్నీ ఒక క్రమపద్ధతిలో జరుగుతాయి. మేము మంచి పురోగతి సాధిస్తాం. ఈ వాణిజ్య ఒప్పందంపై భారత్?, అమెరికా ప్రభుత్వాలు చాలా సానుకూల ధోరణిని కనబరుస్తున్నాయి" అని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్? చెప్పారు. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ట్రేడ్ ఫ్లో (వాణిజ్యం) బలంగా కొనసాగుతోందని అగర్వాల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు ఉన్నప్పటికీ, వస్తు, ఉత్పత్తుల మార్పిడిలో నిరంతర వేగం కొనసాగుతోందని అన్నారు. అయితే భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే తేదీని కానీ , కాలక్రమాన్ని కానీ ఆయన చెప్పలేదు.

**ఒప్పందం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాం!**

ఇంతకు ముందు భారత్ పర్యటనకు వచ్చిన గోర్? మాట్లాడుతూ, "ఈ వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది. దాదాపు మొత్తం చర్చలు పూర్తయ్యాయి. కేవలం ఒక శాతం అంశాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ చర్చలకు ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఇరు దేశాల మధ్య గత రెండు దశాబ్దాలుగా విస్తృత స్థాయిలో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. మేము దాదాపు ఏడాదిన్నరగా ఈ ఒప్పందంపై పనిచేస్తున్నాం. దీన్ని విజయవంతంగా ముగించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని గోర్ అన్నారు.

# ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. టీనేజీ వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ౕజుూ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి టీనేజ్ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైందా అనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం- యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ 'ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్లిపోకుండా ప్రభుత్వం లేదా వ్యవస్థ ఎలా అడ్డుకోగలదు? పిల్లలపై జరిగే లైంగిక దాడులు, దోపిడీని అరికట్టేందుకే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అనేది సులభంగా ముప్పునకు లేదా ప్రభావానికి లోనయ్యే వయసు. ప్రయోగాలు చేసే సున్నితమైన దశ. అలాంటప్పుడు ప్రతి ప్రేమ వ్యవహారాన్ని పోక్సో కేసుగా ఎలా మారుస్తారు?' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 2023లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పులో యువతులు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు 2024లో ఆ తీర్పును రద్దు చేసి, యుక్త వయస్కుల గోప్యత హక్కుల అంశంపై సుమోటో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం అదే కేసు విచారణ కొనసాగుతోంది.



**'తల్లిదండ్రులు పరువు కోసం క్రిమినల్ కేసులు పెడుతున్నారు'**

విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ఈ కేసు నేపథ్యాన్ని వివరించారు. ఒక మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో స్వచ్ఛందంగా వెళ్లి ప్రస్తుతం అతనితో కలిసి జీవిస్తూ, వారికి ఒక బిడ్డ కూడా ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. పోక్సో చట్టం కారణంగా ఇలాంటి సంబంధాల్లో ఉన్న యువకులు జైలుకు వెళ్లాల్సి వస్తోందని ఆమె వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం '16 నుంచి 18 ఏళ్ల మధ్య యువత ప్రేమలో పడి కలిసి వెళ్లిపోతారు. కుటుంబ పరువును కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది.

2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సమ్మతి వయసును 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు పెంచారని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. అయితే టీనేజీ ప్రేమ సంబంధాలు 2012 తర్వాత మాత్రమే మొదలయ్యాయని చెప్పలేమని, ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉండేవని పేర్కొంది. బాల్య వివాహాలు కూడా గతంలో సాధారణమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే చట్టం మారడంతో ఇప్పుడు అలాంటి సంబంధాలు నేర పరిధిలోకి వచ్చాయని వివరించింది.

**పోక్సో కేసుల పర్యవేక్షణపై సూచనలు**

పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం అని మాధవి దివాన్ అభిప్రాయపడ్డారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కేసుల్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోక్సో చట్టం అమలుకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు జులై 17కు వాయిదా వేసింది.

**బహిరంగ ప్రదేశాల్లో పోర్న్ చూడటంపై నిషేధించాలి!- కోర్టు ఏం చెప్పిందంటే?**

బహిరంగ ప్రదేశాల్లో అశ్లీల (పోర్నోగ్రఫీ) వీడియోలు, కంటెంట్ చూడటాన్ని నిషేధించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరుతూ దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (ౕxూ) సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ అంశం న్యాయపరమైనది కాదని, విధానపరమైన నిర్ణయాలకు సంబంధించినదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ అంశం ప్రాధాన్యత కలిగినదేనని అంగీకరించినప్పటికీ, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అని పేర్కొంది.

# 'ఎస్-500' వచ్చేస్తోంది..!

భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర' కోసం రష్యా ఒక అసాధారణమైన ప్రతిపాదనను భారత్ ముందు ఉంచింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతన వాయు రక్షణ వ్యవస్థగా పేరొందిన 'ఎస్-500' ఆధారిత సాంకేతికతను భారతదేశంతో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయడానికి మాస్కో సిద్ధంగా ఉన్నట్లు రష్యా వర్గాలను ఉటంకిస్తూ 'ఐడిఆర్‌డబ్ల్యూ' పేర్కొంది. నిజానికి ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఏర్పడిన అంతర్గత భద్రతా అవసరాల దృష్ట్యా, గతంలో ఎస్-500 వ్యవస్థను నేరుగా భారతదేశానికి విక్రయించడానికి రష్యా నిరాకరించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, నేరుగా విక్రయించే బదులు.. ఎస్-500 సామర్థ్యాలను భారతదేశంతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి మొగ్గు చూపింది. రష్యా నుంచి వచ్చిన ఈ ప్రతిపాదన భారతదేశపు ప్రస్తుత, భవిష్యత్ బహుళ అంచెల వాయు రక్షణ నిర్మాణాన్ని మరింత శక్తివంతం చేయనుంది.

**ఏమిటీ సుదర్శన్ చక్ర ప్రాజెక్ట్?**

భారతదేశం తన సొంత గగనతల రక్షణ అవసరాల కోసం 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'ను అభివృద్ధి చేస్తోంది. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థ మాత్రమే కాదు; సుదూర ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా సెన్సార్లు, అత్యాధునిక రాడార్లు, కమాండ్-అండ్-ంట్రోల్ నెట్‌వర్క్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే ఒక సమీకృత నెట్‌వర్క్. ఇది ఇప్పటికే భారత్ వద్ద ఉన్న రష్యన్ ఎస్-400 వ్యవస్థతో పాటు, స్వదేశీ వాయు రక్షణ ప్రాజెక్ట్ 'కుషా' లతో కలిసి సమన్వయంతో పనిచేస్తుంది.



**తిరుగులేని భారత్ శక్తి**

రష్యాకు చెందిన ఎస్-400 కంటే ఎస్-500 ఎంతో అధునాతనమైనది. ఈ సాంకేతికత తోడైతే, భారత రక్షణ వ్యవస్థ శత్రుదేశాల విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, అత్యంత వేగంగా దూసుకొచ్చే హైపర్‌సోనిక్ ఆయుధాలను సైతం గాల్లోనే తుత్తునియలు చేయగలదు. అంతేకాకుండా, మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో పాటు, కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల స్టెల్త్ ఫైటర్ జెట్‌లను కూడా ఇది గుర్తించి కూల్చివేయగలదు.

**వ్యూహాత్మక ప్రాధాన్యత -- టెక్నాలజీ బదిలీ**

బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనేందుకు భారత్ ఇప్పటికే స్వంత మార్గసూచితో బాలిస్టిక్ క్షిపణి రక్షణ ఫేజ్-× ను మోహరించింది. ఇది అంతరిక్షం వెలుపల, వాతావరణం లోపల వచ్చే క్షిపణులను అడ్డుకుంటుంది. ఇలాంటి తరుణంలో రష్యా ప్రతిపాదన భారత్‌కు అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే, ఈ ప్రతిపాదన కేవలం ఆయుధాల కొనుగోలుకు పరిమితం కాకుండా, అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యత ఇస్తుంది.

**చిరకాల మైత్రికి నిదర్శనం**

ఒకప్పుడు కేవలం ఆయుధాల విక్రయదారుడిగా ఉన్న రష్యా, ఇప్పుడు భారతదేశపు సమీకృత వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా మారడానికి సిద్ధపడటం ఇరు దేశాల చిరకాల మైత్రికి, వ్యూహాత్మక బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే భారత గగనతలం వైపు కన్నెత్తి చూడటానికి కూడా శత్రుదేశాలు వణకక తప్పదు.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్..?



ఇరాన్‌లో ఓ ప్రముఖ వార్తాపత్రిక ప్రచురించిన కథనం అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక 'హిట్‌లిస్ట్'ను ఆ పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే 'హమ్‌షహ్రీ' అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. "ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు.. మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారు" అని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. 'హమ్‌షహ్రీ' పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ.. తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను

**విశాఖపట్టణం :** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభి వృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. “అడవి తల్లి బాట” వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల



ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

# పవన్ ట్రాప్‌లో జగన్

**నెల్లూరు :** రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్



మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్ చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా మారుతున్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉన్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

# రావణ్ చుట్టూ రాజకీయం

## రంగంలోకి ప్రకాష్ రాజ్, గగన... దూరం పెడుతున్న జడ

విజయవాడ : గత 10 రోజుల నుండి సోషల్ మీడియా , ఎలక్ట్రానిక్ మీడియా లో ‘ప్రశ్న రావణ్’ పేరు ఏ రేంజ్ లో మారుమోగిపోతుందో చూస్తూనే ఉన్నాం. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై పీకలదాకా నిండిన ద్వేషం తో , ఇష్టమొచ్చినట్టు బూతులు మాట్లాడడమే కాకుండా, హిందూ దేవుళ్లను దూషించడం, టెర్రరిస్టులకు , నక్సలైట్లకు సపోర్టుగా వీడియోలు చేయడం వంటివి చేసిన ఇతన్ని పోలీసులు ఉపా చట్టం క్రింద కేసులు నమోదు చేశారు. ఇతన్ని అరెస్ట్ చేయడాన్ని అందరూ సామర్ధించారు, ఒక్క వైసీపీ పార్టీ శ్రేణులు , యాంటీ నేషనలిస్ట్ భావాలు గల ప్రకాష్ రాజ్ వంటి వారు తప్ప. అయితే నెల్లూరు జైలు లో రిమాండ్ లో ఉన్నటువంటి రావణ్ మొబైల్ ని పరిశీలించిన పోలీసులకు కొన్ని సంచలన నిజాలు తెలిసాయి , రావణ్ అకృత్యాలు , మోసాలు అన్నీ బయటపడ్డాయి.దీంతో అతనికి సపోర్టు చేసిన వారు ఒక్కొక్కరిగా జారుకున్నారు. వైసీపీ పార్టీ వాళ్ళు అయితే కొందరు రావణ్ లాంటోళ్లని మేమెందుకు చేరదీస్తామని తప్పుకునే ప్రయత్నం చేయగా, అంబటి రాంబాబు వంటి వారు రావణ్ కి వైసీపీ పార్టీ న్యాయ సహాయం చేస్తామని మాట ఇచ్చారు. మాట ఇవ్వడమే కాదు , న్యాయ సహాయం కూడా చేస్తున్నారు. దీంతో మొదటి నాలుగు కేసుల్లో రావణ్ కి బెయిల్ ఇప్పించిన జడ శ్రవణ్ వంటి వారు కూడా ఈ కేసు నుండి తెలివిగా తప్పుకున్నారు. ప్రకాష్ రాజ్ కూడా సైలెంట్ అవ్వడం తో , అతనికి నిజాలు తెలిసి సైలెంట్ అయిపోయారని , ఇప్పటికైనా బుద్ధితెచ్చుకున్నారని అంతా అనుకున్నారు. కానీ కట్ చేస్తే కాసేపటి క్రితమే ప్రకాష్ రాజ్ విడుదల చేసిన వీడియో సంచలనంగా మారింది. ఈ వీడియో లో ఆయన ఇప్పటికీ రావణ్ తప్పు చేసినట్టుగా ఒప్పుకోవడం లేదు .అతని కోసం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు ప్రకాష్ రాజ్. ఆయన మాట్లాడుతూ ‘చాలా మంది నేను సైలెంట్ అయిపోయానని అంటున్నారు. నేనేమి సైలెంట్ అవ్వలేదు , మొత్తం చూస్తూ ఉన్నాను, మీరు ఎంత దిగజారిపోతున్నారో గమనిస్తూ ఉన్నాను. అసత్య ప్రచారాలతో నేరుగా ఎమ్మెల్యేలు , ఎంపీలు రంగం లోకి దిగడం, యూట్యూబర్లు , జనసైనికులు, కొన్ని అమ్ముడుపోయిన మీడియా చానెల్స్ చేస్తున్న ప్రచారాలను గమనిస్తున్నాను. వీటి అన్నిటికీ ఒక్కటే సమాధానం చెప్తున్నాను. దిగజారండి , ఇంకా ఇంకా దిగజారుతూనే ఉండండి, మీరు ఎంత దిగజారిన ప్రపంచం మొత్తం మిమ్మల్ని గమనిస్తూనే ఉంది, మీరు ఏమి చేసిన ప్రశ్నించే గొంతుకని ఆపలేరు’ అంటూ ఒక వీడియో ని విడుదల చేసాడు ప్రకాష్ రాజ్. దీనిపై నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### గగన ఎవరు

: ప్రధాన మీడియా పట్టించుకోలేదు. కానీ సోషల్ మీడియా ఊరుకోదు కదా.. లోతుగా తవ్వింది.. అసలు ఏం జరిగింది అని తెలుసుకుంది. చివరికి ప్రశ్న వెనుక ఉన్న అసలు ముసుగును బయటపెట్టింది. తద్వారా నిజం తెలిసింది. ఇంతకీ ఏం జరిగింది.. ఏపీలో ఈ పరిణామం దేనికి దారి తీయ పోతోంది..ఉపా చట్టం కింద బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అతడు ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ ఖైదీగా ఉన్నాడు. వాస్తవానికి రావణ్ ఒక్కడే కాదని.. అతను ఒక్కడు ఇదంతా చేయలేదని.. తెర వెనుక చాలా కథ ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. రావణ్ వెనుక ఉన్న అసలు కథను తవ్వితీయడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక మహిళ పేరు తెర మీదికి వచ్చింది. ఆమె పేరు గమన..ఇటీవల వైసిపి అధినేత జగన్ విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో కి వచ్చినప్పుడు గమన ఆయనను కలిసింది. అప్పుడు జగన్ ఆమె నెత్తి మీద చేయి పెట్టి ఆశీర్వదించారు. కచ్చితంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దానికి గమన ఉప్పొంగిపోయింది.. ధన్యోస్మి అన్న లెవెల్లో హవ భావాలు ప్రదర్శించింది. జగన్ ను కలిసిన తర్వాత గమన ఎవరు అనే చర్చ మొదలైంది. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టడంతో గమనకు సంబంధించిన అసలు విషయాలు బయటపడుతున్నాయి.ప్రశ్న యూట్యూబ్ ఛానల్ కు సీఈవోగా గమన వ్యవహరిస్తోంది. ఈ ఛానలకుసంబంధించిన ఫండింగ్ మొత్తం గమన సమకూర్చుతోంది. రావణ్ తో ఆమె అత్యంత సన్నిహితంగా ఉండేది. అతడితో కలిసి రీల్స్.. కాంట్రవర్షల్ పొలిటికల్ వీడియోలు కూడా రూపొందించేది. వైసిపికి అనుకూలంగా ఉండే సోషల్ మీడియా నెట్వర్క్ లో ఈమె తెరవెనుక అత్యంత కీలకపాత్ర పోషించిందని తెలుస్తోందిప్రశ్న యూట్యూబ్ స్టూడియో.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన రాజకీయ లింకులు మొత్తం విచారణలో బయటపడుతున్నాయి.. వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గం మాదినేని ఉమామహేశ్వర నాయుడు సోదరుడికి సంబంధించిన ఒక ప్లాట్ లో ఈ ఛానల్ స్టూడియో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కాంట్రవర్షల్ కంటెంట్.. ఇతర ప్రొడక్షన్ మొత్తం కూడా అక్కడి నుంచే కొనసాగుతోందని సమాచారం. అయితే దీని వెనుక అతిపెద్ద రాజకీయ కుట్ర కోణం ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. కీలకమైన డేటా మొత్తం స్వీకరించారు. ప్రస్తుతం ఈ కేసు తీవ్రమైన రూపు దాల్చడంతో.. పోలీసులు గమనికు అధికారికంగానే నోటీసులు ఇచ్చారు. రావణ్ మొబైల్ ఫోన్.. లాప్టాప్ మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలకమైన సమాచారాన్ని.. వీడియోలను పోలీసులురికవరీ చేశారు..

## గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

-మొదటిపేజీ తరువాయి

చేశారని ముఖ్యమంత్రి అడిగారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదిత గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తాత్కాలిక సేకరణ, చెత్త వేర్వేరుగా విభజించే కేంద్రంగా పనిచేస్తుంది. ఇక్కడ సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలిస్తారు. ఈ అత్యాధునిక బదిలీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన లేఅవుట్, ప్రణాళిక, డిజైన్, సాంకేతిక అంశాల రూపకల్పనలో సహాయపడేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఇంజనీరింగ్ బందాన్ని పంపిస్తుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. వీధి వీధిలో దుకాణాల వెంట తిరిగి చెత్త సేకరించే సాధారణ టిప్పర్ కార్యకలాపాలకు బదులుగా, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 'ఎలక్ట్రిక్ వాహనాలను' వినియోగించవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ సూచించారు. సర్వీస్ మోడల్ లో అనుభవం కలిగిన ఏజన్సీల నుంచి వాహనాలను తీసుకుని అద్దె చెల్లించవచ్చని, తద్వారా మున్సిపల్ ఘన వ్యర్థాల సేకరణ సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ సీజీఎం ఐఎల్ రామ్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, జోనల్ మేనేజర్ అండ్ కమిషనర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఎం.దొరబాబు, జి.జ్యోతి, ఫైనాన్స్ మేనేజర్ జి.బాలమ్మ, మేనేజర్ (ఇంజనీరింగ్) ఎండీ ఇస్మాయిల్ బేగ్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏఎంహెచ్ఓ గోపాల నాయక్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, శానిటరీ ఇనస్పెక్టర్ సుధాకర్, కాంపాక్టర్ మెయింట్ నెన్స్ టీమ్ ఇన్ చార్జి నూతక్కి రామమోహన్, ఆటోనగర్ ఐఏఎల్ఏ మాజీ అధ్యక్షులు ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ముగింపు దశకు ఓటర్ల జాబితా సవరణ

-మొదటిపేజీ తరువాయి

ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. పంపిణీ చేసిన వాటిలో ఇప్పటివరకు 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అంటే మొత్తంగా 88 శాతం మంది ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఇంకా 1.67 శాతం ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**లక్షల్లో మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్లు**

ఈ సర్వేలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇది మొత్తం ఓటర్లలో 3.41 శాతంగా ఉంది. అలాగే, ఉపాధి, ఇతర కారణాల వల్ల శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన (షిఫ్ట్ అయిన) ఓటర్లు కూడా భారీగానే ఉన్నారు. ఇలాంటి వారు 12,14,994 లక్షలు ఉన్నట్లు సర్వేలో తేలింది.

**అందుబాటులో లేని వారు**

బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లినప్పటికీ కొందరు అందుబాటులో లేరు. ఇలా సుమారు 7,26,425 లక్షల (1.75 శాతం) ఓటర్లు దొరకలేదని అధికారులు పేర్కొన్నారు. చనిపోయిన ఓటర్లను పక్కన పెడితే, ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇంకా 9 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

**గడువు పొడిగింపునకు సిఫార్సు**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగుస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. గడువును పెంచాలని కోరుతూ సీఈవోకు వినతిపత్రాలు సమర్పించాయి. దీనికి తోడు కొన్ని పట్టణ (అర్బన్) ప్రాంతాల్లో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాల కలెక్టర్లు సైతం గడువు పొడిగింపునకు సూచనలు చేశారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా పూర్తి చేసేందుకు గడువు పెంచాలని ఆ లేఖలో ఆయన ఈసీని కోరారు.

## చిన్నారుల కేంద్రాలకు కొత్త చిగురు

-మొదటిపేజీ తరువాయి

భవనాలను నిర్మించి వీటిని తరలించాలని సీఎం ఆదేశించారు. అందులో భాగంగా ఈ ఏడాది మరో 2 వేల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కేంద్రానికి నివేదించారు. వివిధ దశల్లో ఉన్న 2,930 కేంద్రాల్లో 915 భవనాల నిర్మాణం తుది దశలో ఉంది. వీటిని నెల, రెండు నెలల్లో పూర్తి చేయవచ్చు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనే ఏకైక కారణంతో జగన్ వీటిని పూర్తి చేయకుండా వదిలేశారు. పెరిగిన ధరల మేరకు అసంపూర్తిగా ఉన్న ఒక్కో భవనం పూర్తి చేసేందుకు ఇప్పుడు లక్ష నుంచి 5 లక్షల వరకు అవసరమవుతుందని అధికారులు చెబుతున్నారు.

కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో దాని నిర్మాణానికి 12 లక్షల రూపాయలు ఇస్తారు. ఇందులో వీబీ జీరామ్ జీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌గా 8 లక్షలు, 16వ ఆర్థిక సంఘం నిధులు కింద 2 లక్షలు, మిగతా 2 లక్షల్లో 1.20 లక్షలు కేంద్రం, మరో 80 వేలు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తాయి. సాధ్యమైన చోట, భవనాలు అందుబాటులో ఉన్నచోట కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల ప్రాంగణాలకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే, సుమారు 10,000 కేంద్రాలు పాఠశాల ప్రాంగణాల్లో పనిచేస్తున్నాయి. మరికొన్నింటిని తరలించే అవకాశాన్ని పరిశీలించడానికి అధికారులు జిల్లాలోని ఒక మండలాన్ని చేపట్టారు. 85 వరకు కేంద్రాలు పాఠశాలకు కిలోమీటరు లోపు దూరంలోనే ఉన్నట్లు తెలిసింది.మిగతా మండలాలకు కూడా అనువైన వాటిని తరలించాలని నిర్ణయించారు. ఆగిపోయిన పాత అంగన్వాడీ కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొత్తగా నిర్మించడానికి సన్నాహాలు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఉదాహరణకు గుంటూరు జిల్లాలో మొత్తం 32 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టింది. గుంటూరు అర్బన్ పరిధిలో 4 కేంద్రాలు, మంగళగిరి మండలంలో 4, ఫిరంగిపురం మండలంలో 9, పొన్నూరు మండలంలో 6, ప్రత్తిపాడు మండలంలో 2, తెనాలి మండలంలో 7 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం ప్రారంభించగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి. జిల్లాలోని 32 కేంద్రాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 2031 కేంద్రాలుండగా, నిర్మాణం చేపట్టిన వాటిలో 56 చివరి దశలో, 14 స్లాబ్ లెవల్ దశలో, 2 రూఫ్ లెవల్ దశలో, 2 బేస్మెంట్ లెవల్ దశలో ఉండగా, మొత్తంగా 74 భవనాలు పూర్తి చేయాల్సి ఉండగా వీటి కోసం మూడు కోట్ల 80 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. బాపట్ల జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 18 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం వెంటనే పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# ఆరు నెలలుగా జీతాలు లేక కొంతంగి పారిశుధ్య కార్మికులు అవస్థలు

## గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు.. అధికారుల తక్షణ స్పందన..



**,శంఖవరం: జులై 13 (ప్రజాజ్యోతి న్యూస్) రిపోర్టర్ శ్రీనివాస్** శంఖవరం మండలం కొంతంగి గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాల పోషణ భారంగా మారడంతో పాటు అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను నెలల తరబడి జీతాలు లేకుండా పనిచేయించడం అన్యాయమన్నారు వర్షాలు, ఎండలు లెక్కచేయకుండా ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జీతాలు అందక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రీవెన్స్‌లో సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా అధికారులు సమస్యపై వెంటనే స్పందించి, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేసి, ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

# భక్తిశ్రద్ధలతో శివనామస్మరణ







## గన్నవరంలో వైభవంగా మాస శివరాత్రి వేడుకలు

### శ్రీ కార్తికేయ శివాలయంలో విశేష పంచామృతాభిషేకాలు

**ఎటపాక, జూలై 13 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలోని శ్రీ కార్తికేయ శివాలయంలో సోమవారం మాస శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం, ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి ఒకే రోజు కలిసి రావడంతో ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పంచామృతాలు, పండ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయమంతా "ఓం నమః శివాయ" నామస్మరణతో మారుమోగి భక్తిమయ వాతావరణం నెలకొంది. అభయాంజనేయ స్వామికి విశేష అర్చనలు శివాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారికి కూడా అర్చకులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గన్నవరంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా ముగిసింది.

## శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆశీస్సులు అందుకున్న మాజీ సర్పంచ్ హెచ్.ఎన్. రాము కుటుంబం



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: జులై 13: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:** హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ హెచ్ ఎన్ రాము నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేశారు ఇటీవల వివాహం జరిగిన నూతన వధూవరులకు మౌనిక మనోజ్ దంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు ఈ సందర్భంగా హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ నూతన దంపతులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు మాజీ సర్పంచ్ హెచ్ ఎన్ రాము కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు స్థానిక నాయకులు పార్టీ కార్యకర్తలు గ్రామ పెద్దలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ఎమ్మెల్యే రాకతో గ్రామంలో సందడి నెలకొంది అభిమానులు ఆయనతో ఫోటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు

# వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలి

### దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో వరుణ యాగం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి





**హోళగుంద, జూలై 13, ప్రజా జ్యోతి న్యూస్ –** మండలం పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవరగట్టు శ్రీ శ్రీ శ్రీ మాల మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో వరుణ యాగం పూజా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం మూడవ రోజుకు చేరుకున్న ఈ యాగంలో ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బుసినే విరుపాక్షి పాల్గొన్నారు. సమతగేరి రామిరెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి కు ఆలయ అర్చకులు, నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన వరుణ యాగం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను బహూకరించారు. లోకకల్యాణార్థం, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తప్పెట రామిరెడ్డి తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గ, మండల కమిటీల ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు బి.వి.ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## భక్తుల రద్దీతో కిటకిటలాడిన శంఖవరం శివాలయం...



**శంఖవరం జూలై 13 (ప్రజా జ్యోతి న్యూస్) రిపోర్టర్ శ్రీనివాస్** భక్తులు రద్దీతో కిటకిట లాడుతున్న శివాలయం కృష్ణ చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం కలిసి రావడంతో అన్నవరం శ్రీశ్రీశ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దత్తత దేవాలయమైన శ్రీ పార్వతి మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిట లాడింది.ఆలయ అర్చకులు రాంపల్లి కుమార్ శర్మ శివునికి ప్రీతికరమైన పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మారేడు దళాలు, వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. శివనామ స్మరణలతో ఆలయం అంతా మారుమోగింది. భక్తులు వరుసల్లో నిలబడి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఆలయ అర్చకులు కుమార్ శర్మ మాట్లాడుతూ ఈరోజు కృష్ణ చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం కలిసి రావడం చాలా అరుదు. ఈ రోజు మహా శివుని దర్శించుకుంటే మహాశివరాత్రి రోజున వచ్చే పుణ్యఫలంతో సమానమైన ఫలితం లభిస్తుందని కుమార్ శర్మ తెలిపారు.ఈ ప్రత్యేక రోజును పురస్కరించుకుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## చాగరమర్రి ఈఓ గా శబియాబేగం.....

**ఈఓ గా శబియాబేగం.....**



**చాగలమర్రి , జులై 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ) గా షేక్ శబియాబేగం సోమవారం విధుల్లో చేరారు. గత కొన్ని నెలలుగా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపీడీఓ తారేకశ్వరి చాగలమర్రి ఇన్‌చార్జ్ ఈఓగా బాధ్యతలు నిర్వహించేవారు. కడప జిల్లా మైదుకూరు మండలం తిప్పారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శబియా బేగం ఇటీవల జరిగిన పదోన్నతుల్లో గ్రేడ్ 1 పంచాయతి కార్యదర్శిగా పదోన్నతి పొందటంతో ప్రభుత్వం చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆమె విధుల్లో చేరారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్యాన్ని మెరగుపరచి గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని శబియా తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది,సచివాలయాల సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.

## ప్రాణాయామంతో ప్రశాంతత ఎనర్జీ మేనేజ్‌మెంట్‌తో ఏకాగ్రత

**-- ఐక్యూ డెవలప్‌మెంట్‌తోనే విద్యార్థుల ఉజ్వల భవిత**



**ధర్మవరం: ప్రజా జ్యోతి న్యూస్: జూలై 13:** శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:ధర్మవరం బాలికల పాఠశాల హెడ్ మాస్టర్ సుమన అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు విద్యార్థి దశలో మానసిక ఎదుగుదలకు చదువులో రాణించడానికి ఐక్యూ డెవలప్‌మెంట్ ఎంతవరకు అవసరం నిత్య జీవితంలో ఎనర్జీ మేనేజ్‌మెంట్ శక్తి నిర్వహణ మరియు ప్రాణాయామ క్రియల ను అలవర్చుకోవడం వల్ల విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి తమ మేధోశక్తిని ఎలా పెంపొందించు కోవాలో తెలియజేశారు చివరగా నేను చెప్పేది ఒక్కటే మేధస్సుకు ప్రతిరూపం ఐక్యూ దానికి ఇంధనం ఎనర్జీ మేనేజ్‌మెంట్ వీటన్నింటినీ నడిపించే శ్వాస ప్రాణాయామం ఈ మూడింటిని ఎవరైతే తమ విద్యార్థి జీవితంలో అలవర్చుకుంటారో వారు కేవలం తరగతి గదిలోనే కాదు, రేపటి సమాజంలోనూ ఉత్తమ విజేతలుగా నిలుస్తార ప్రాణాయామం ఒత్తిడిని జయించే ఆయుధం మరి ఈ ఐక్యూని ఎనర్జీని కంట్రోల్ చేసే శక్తి దేనికి ఉందంటే అది ప్రాణాయామం కే సాధ్యం శ్వాసపై ధ్యాస పెట్టడమే ప్రాణాయామం నిత్యం కొద్ది నిమిషాల పాటు ప్రాణాయామం చేయడం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరిగి, జ్ఞాపకశక్తి మునుపటి కంటే మెరుగవుతుంది పరీక్షల సమయంలో వచ్చే యాంగ్జైటీ భయం మరియు మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుంది మనసు ప్రశాంతంగా ఉంటే ఎంత కష్టమైన సబ్జెక్ట్ అయినా సులభంగా అర్థమవుతుం దని వారు తెలియజేశారు తదనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో పీడీలు స్వరూప సరళ జూడో కోచ్ భాష ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి పర్యటనకు తాళ్లపూడి నుండి భారీగా తరలి వెళ్ళిన ప్రజానీకం



**తాళ్లపూడి, జులై 13, ప్రజాజ్యోతి న్యూస్** ముఖ్యమంత్రి చంద్రబాబు ధవళేశ్వరం లోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులకు శ్రీకారం అనంతరం పిచ్చుకులంకలో రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమానికి తాళ్లపూడి మండలం నుంచి భారీగా తరలి వెళ్లిన కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు మహిళలు ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన అజెండా అని గత ప్రభుత్వంలో అన్నదాతలు అనేక కష్టాలు పడేవారని చంద్రబాబు నాయకత్వంలో రైతులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణ తో డెల్టా రైతులు కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు

# హిందూపురశీ గర్వించదగ్గ ఘనత.. కర్ణాటకలో రాష్ట్ర ప్రథమంగా గోల్డ్ మెడల్ సాధించిన కావ్యశ్రీ

**- ఎం ఫార్మసీలో అత్యుత్తమ ప్రతిభ ప్రత్యేక కార్యక్రమంలో గోల్డ్ మెడల్ ప్రశంసా పత్రం అందుకున్న యువతి**



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్ : జూలై 13: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:** హిందూపూర్ పట్టణంలోని ముదిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన సి కావ్యశ్రీ విద్యారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచి హిందూపూర్ ఖ్యాతిని కర్ణాటక రాష్ట్ర స్థాయిలో చాటిచెప్పారు బెంగళూరులోని ఆచార్య కాలేజీలో ఎం.ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న ఆమె అత్యుత్తమ ప్రతిభతో కర్ణాటక రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించి ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్ అందుకున్నారు ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సత్కార కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డి కె శివకుమార్ చేతుల మీదుగా కావ్యశ్రీ గోల్డ్ మెడల్తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కావ్యశ్రీ కృషి పట్టుదల లక్ష్యసాధనతో ఈ ఘనతను అందుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడుతున్నారు ఆమె విజయం హిందూపూర్ పట్టణానికే కాకుండా అనంతపురశీ శ్రీ సత్యసాయి జిల్లాకు కూడా గర్వకారణంగా మారింది అనీ పలువురు ప్రశంసించారు

# పైడిమెట్ట ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ బృందం



**తాళ్లపూడి, జూలై 13, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా పైడిమెట్ట ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన నీటిపారుదల శాఖ ఇంజనీర్లు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం చైర్మన్ ముళ్ళపూడి శ్రీరామ చంద్రమూర్తి, గన్నిన సత్తిబాబు మాట్లాడుతూ పైడిమెట్ట ఎత్తిపోతల పథకానికి కావలసిన అవసరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రైతు సంక్షేమమే ప్రథమం అని అన్నారు. పైడిమెట్ట ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే తాళ్లపూడి మండలంలో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రతి రైతుకు సాగు నీటిని పూర్తిస్థాయిలో అందిస్తే మండల రైతుల జీవితాలు మారుతాయన్నారు. పలువురు ఆయకట్టు రైతులు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకానికి తగిన నిధులు మంజూరు చేసి రైతులకు శుభవార్త చెప్పాలని అన్నారు

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ గడువు పెంచాలి



**గుంతకల్లు జూలై 13 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ గడువు ఈనెల 14తో ముగియనుంది అయితే ప్రభుత్వం అనుకున్న రీతిలో పూర్తి కాలేదని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయి, కావున ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గడువు మరింత పొడిగించాలని బహుజన సమాజ్ పార్టీ గుంతకల్లు పట్టణ అధ్యక్షులు బోయ రాధాక్రిష్ణ, అధ్యక్షతన గుంతకల్లు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ కి వినతి పత్రం ద్వారా తెలియజేయడ మైనది. గ్రామీణ ప్రాంతాల నుండి వలస వెళ్లిన రైతులు, కార్మికులు, అనేకమంది నిరక్షరాస్యులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారు. రాజకీయ నాయకుల జోక్యం తగ్గించి, అధికారుల పర్యవేక్షణలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగించాలని ఆర్. డి. ఓ ని కోరడమైనది. ఈ కార్యక్రమం నియోజక వర్గం ఇంచార్జి సయ్యద్ షాహుల్ హమీద్, నియోజక వర్గం ఉపాధ్యక్షులు ఎం. జామిని, పట్టణ ఇంచార్జి అల్లా బకాష్, ఉపాధ్యక్షులు సాజిదా, ప్రధాన కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న కౌతాళంలో సర్వసభ్య సమావేశం

**:- ఆయా శాఖకు సంబంధించిన అధికారులు తాజా నివేదికతో తప్పక హాజరు కావాలి... ఎంపీడీవో స్వర్ణలత**



**కౌతాళం,జులై 13 ప్రజా జ్యోతి** కౌతాళం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరము నందు,ఈ నెల 18న మండల అధ్యక్షులు అమరేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉంటుందని కావున,జడ్పిటిసి సభ్యులు ,వైస్ ఎంపీపీ - 1 మరియు 2 , కో ఆప్టేడ్ సభ్యులు, ఎంపిటిసి సభ్యులు,వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు అందరూ తప్పక హాజరు కావలసినదిగా ఒక ప్రకటన ద్వారా ఎంపిడిఓ స్వర్ణలత కోరడమైనది. ముఖ్య గమనిక వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు అందరూ మీమీ శాఖలకు సంబంధించి తాజా ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

# ఫుట్ పాత్ రోడ్డు మీద జీవనోపాధి పొందుతున్న పేదల కుటుంబాలను బుగ్గిపాలు చేసిన ప్రభుత్వ యంత్రాంగం!

**మానవత్వాన్ని మరిచిన ప్రభుత్వ ఉద్యోగులు !!**
**పేదలకు ఉపాధిని కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి !!!**



**గుంతకల్లు జూలై 13 (ప్రజా జ్యోతి):** అనంతపురం నగరంలో సోమవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు ), ఐసా విద్యార్థి సంఘం, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీల ఆధ్వర్యంలో ప్రభు త్వ గవర్నమెంటు హాస్పిటల్ కుడి ఎడమ ప్రక్కన తెలుగు తల్లి విగ్రహం నుండి బ్రిడ్జి వరకు ఫుట్ పాత్ ల మీద పేదలు టీ, టిఫిన్, భోజనం, పండ్లు, పూలు పచ్చి టెంకాయలు తినే ఆహారపు వస్తువులను హాస్పిటల్ కి వచ్చే రోగులకు వారి బంధు వులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతూ అనేక సంవత్సరా లుగా ఉన్నారు. ఫుట్ పాత్ ల మీద విక్రయిస్తున్న ఆహార పు వస్తువులు రోడ్డుకు అడ్డం గా ఉన్నాయనే పేరుతో మునిసిపల్ అధికారులు పోలీసులు ఇరువురు కలిసి పేదల యొక్క జీవనోపాధిని దెబ్బతీయడం జరిగినది. అక్కడ విక్రయిస్తున్న అన్నం పప్పు పాలు టి, కోడిగుడ్లు కూల్ డ్రింక్స్, ఫ్రిడ్జ్ తోపుడు బండ్లను, పాలిథిన్ కవర్లతో తాత్కాలికంగా వేసుకున్న షెడ్లను జెసిబి లతో ముందస్తు హెచ్చరిక నోటీసు లేకుండానే అమానుషంగా కూల్చివేయ డం జరిగినది. అధికారుల దుర్మార్గపు చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ఫుట్ పాత్ ల మీద ఆహారపు వస్తువులను విక్రయిస్తూ దాదాపుగా ఒక్కొక్కరు 25 సంవత్సరాలుగా అక్కడే ఉంటూ తమ పిల్లలను చదివించుకుంటూ తమ కుటుంబాలను పోషించు కుంటూ ఉపాధి పొందుతు న్నారు. ఇప్పుడు అధికారుల చర్యల వలన దాదాపుగా 100 కుటుంబాలు రోడ్డు పాలైనాయని మా కుటుం బాలను ఏ విధంగా పోషించు కోవాలి, మా పిల్లలని ఏ విధంగా చదివించుకోవాలి, రోజు వారి ఫైనాన్స్ ను ఏ విధంగా చెల్లించాలిని దీనంగా బోర్న వినిపిస్తూ ప్రజా సంఘాల నాయకుల దగ్గర కన్నీళ్ళతో చెప్పుకోనడం జరిగినది. పోలీ సులు మున్సిపల్ అధికారుల వలన పేదలకు లక్షలాది రూపాయలను నష్టం చేయడం జరిగినది. కనీసం తమ వస్తువులను తమ వెంట తీసుకొని వెళ్తామని అధికారు లను కాళ్లు పట్టుకొని ప్రాధా యబడిన కరుణించకుండా పేదల పట్ల కర్కస్యంగా ప్రవర్తించినారని తెలుపుతు న్నారు. కష్టం చేసుకుని కుటుంబాలను పోషించుకుం టున్న పేదల మీద పోలీసులు బెదిరింపులు దౌర్జన్యం చేస్తున్నారు. అయితే రాజకీయ నాయకులు తప్పుడు పనులు, భూ కబ్జా లు దౌర్జన్యాలు చేస్తున్న వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోకుండా వారికే సహ కరిస్తున్నారు. పేదల మీద మాత్రం పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగినది. మున్సిపల్ అధికా రులకు సంవత్సరానికి 3000 పన్ను రోజు 20 రూపాయల నుండి 50 రూపాయలు వరకు పన్నులు చెల్లిస్తున్నామని అయినా మా ఉపాధిని దెబ్బతీయడం జరిగినది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు వెంటనే పై విషయం మీద స్పందించి మరల ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలు ఫుట్ పాత్ ల మీద ఆహారపు వస్తువులను విక్రయించుకుంటూ ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము. లేని పక్షంలో అధికారుల దుర్మార్గపు చర్యలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తు న ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, నగర అధ్యక్షులు దావీదు, ఐసా విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి వేమన, ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సాకే హరి, కమిటీ సభ్యులు శ్రీధర్ పాల్, యుగంధర్, ఐ ఎఫ్ టి సి కమిటీ సభ్యులు రామంజి, ఈశ్వరయ్య, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం మరియు పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ-2 శోభారాణి

**కౌతాళం జూలై 13 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని గోతులదొడ్డి మరియు పొదలకుంట గ్రామాలలో సోమవారం రోజున ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యా బోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనా ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నదని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలన్నారు. పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి విద్యార్థినీ, విద్యార్థులలో పౌష్టికాహారలోపం లేకుండా ఉండేలా మధ్యాహ్న భోజనంలో ప్రతీ రోజు పౌష్టికాహారంతో ప్రత్యేక మెనూను ప్రభుత్వం అమలు చేస్తున్నదని,దీంతో పాటు అంతేకాక చిక్కీలు కూడా అందిస్తున్నది, నిర్దేశించిన మెనూను ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తన పరిశీలనలో తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు ఉంటాయని వారు తెలిపారు. మధ్యాహ్న భోజన కిచెన్ ని పరిశీలించి వంట సరుకుల నాణ్యత,కోడిగుడ్ల పరిమాణం,చిక్కీల నాణ్యత,భోజనం నాణ్యతను,కిచెన్ లో



పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వండిన ఆహారం పరిమాణంలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆహారం వండే విధానం,మెనూ ప్రకారం పిల్లలకు అందిస్తున్నారా లేదా అని కూడా పరిశీలించాలన్నారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తెలియజేయాలని, భోజనానికి ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలని తెలియజేస్తూ పరిశీలించాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. విద్యా కానుక కింద అందించిన బ్యాగ్ లు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందరికీ అందాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.



మధ్యాహ్న భోజనం నాణ్యతను గురించి కూడా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.భోజన నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శోభారాణి మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు వంట ఏజెన్సీ వారు పాల్గొన్నారు.

# నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఫ్ఏపిటిఓ ఆధ్వర్యంలో పికెటింగ్

**తాళ్లపూడి, జూలై 13, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఏపి టి ఓ) ఆధ్వర్యంలో న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం జూలై 14 మంగళవారంతూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుండి పికెటింగ్ నిర్వహిస్తున్నామని ఈ పికెటింగ్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ దున్నా దుర్గారావు ఒక ప్రకటన విడుదల చేసారు. కొన్ని ప్రధాన సమస్యలను వెల్లడించారు 1. టెట్ సమస్య పరిష్కరించాలి 2. 12వ పిఆర్సి కమిషన్ నియమించాలి 3. 30% మద్యంతర భృతి ప్రకటించాలి 4. సిపిఎస్ రద్దు చేసి 5. ఓ పి ఎస్అమలు చేయాలి 5. పెండింగ్ డిఏ లను విడుదల చేయాలి. 6. దీర్ఘకాలిక బకాయిల చెల్లించాలి. 7. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలి. 8. ఎప్పుడో అప్లై చేసుకొని ఇన్కమ్ టాక్స్ కూడా చెల్లించిన సరెండర్ లీవ్ బకాయిల చెల్లించాలి. 9. పాఠశాల స్థాయిలోనే బోధనేతర పనులను రద్దు చేయాలి 10. పాత పద్ధతిలో అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ను ఇవ్వాలి. 11. రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ కమ్యూటేషన్ లీవ్ ఎన్కాష్మెంట్ ఇతర బకాయిలను పదవి విరమణ చేసిన రోజు చెల్లించాలి. 12. 1998 ,2008 ఎం టి ఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి వారి పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాల పెంచాలి. 13. గురుకులాలు రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీలకు 62 సంవత్సరములకు ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలి. 14. బదిలీ అయి సబ్స్టిట్యూట్ లేని కారణంగా రిలీవ్ కానీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలి. 15. ఈ హెచ్ ఎస్ మెడికల్ రీ ఇన్బర్స్మెంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాలి. 16. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా ప్రవేశపెట్టాలి 17. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. 18. కేజీబీవీ స్కూల్స్ మోడల్ స్కూల్స్ సమస్యలను పరిష్కరించాలని తదితర 18 రకాల డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఉద్యమంలో భాగంగా ఈ పికెటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు



## ఓటర్ల ఎన్యూమరేషన్ కార్యక్రమం లో 84.83% నమోదుతో 9వ వార్డు ముందంజ- కటారి రాజేంద్ర



**ఎమ్మిగనూరు:**కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డిల పిలుపుతో నియోజకవర్గంలోని 10వ క్లస్టర్, 9వ వార్డు పరిధిలోని 144వ బూత్‌లో ఓటర్ల ఎన్యూమరేషన్ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. 9వ వార్డు ఇంచార్జి కటారి రాజేంద్ర, వార్డు అధ్యక్షులు ఇబ్రహీం మరియు కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నారు. పార్టీ నిర్దేశించిన గడువులోగా 100 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలనే సంకల్పంతో, తమ వ్యక్తిగత పనులను పక్కన పెట్టి మరీ ప్రతి ఇంటికీ తిరుగుతూ ఫారాలు నింపి బీఎల్‌ఓలకు అందిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 1239 ఓట్లకు గానూ 1051 ఓట్లను నమోదు చేసి, దాదాపు 84.83% పూర్తి చేయడంతో ఈ క్లస్టర్ నియోజకవర్గంలోనే ముందంజలో నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ అధికారులు గిరీష్ కుమార్, నాగమద్దిలేటిలతో పాటు 9వ వార్డు ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, సెక్రటరీ ప్రవీణ్ కుమార్, బూత్ కన్వీనర్, మరియు బూత్ బీఎల్‌ఏ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో 100% ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలి

**జీవో నెం. 3 అమలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**



**కూనవరం: జూలై 13 ప్రజా జ్యోతి** ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్థానిక నియామకాలలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసులకే కల్పించేలా జీవో నెం. 3ను తక్షణమే అమలు చేయాలని పోలవరం జిల్లా కూనవరం మండల ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తెల్లం తమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు అరకు సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసుల రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బాబు, బొర్రయ్య, మడకం నాగమణి, ఉయికా కన్నయ్య పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏల అత్యవసర సమావేశం

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు, జూలై 13 (ప్రజా జ్యోతి):**భారత ఎన్నికల సంఘం ఆదేశాల





మేరకు చేపట్టిన ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం గొల్లప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), బూత్ స్థాయి సహాయకులు (బీఎల్‌ఏలు) ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలో ఇప్పటివరకు జరిగిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ పురోగతిపై అధికారులు ప్రధానంగా సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సందేహాలపై బీఎల్‌ఓలతో చర్చించి, వాటి నివారణకు అధికారులు తగిన సూచనలు మరియు సలహాలు అందించారు.

## గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్షాకాలంలో వచ్చే వివిధ రకాల వ్యాధులు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తద్వారా దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.దోమల నివారణతోనే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకర సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని స్పష్టం చేశారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లు అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, సొంత వైద్యం జోలికి వెళ్లకుండా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్య సిబ్బందిని లేదా ఆసుపత్రిని సంప్రదించి చికిత్స పొందాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం.......

- విద్యుత్ స్థంభానికి డీ కొన్న లారీ...
- ఇద్దరికి తీవ్ర గాయాలు.......



**చాగలమర్రి , జులై 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి పట్టణము గుండా సాగే 40వ జాతీయ రహదారి పై కలుగోట్ల పల్లె రస్తా సమీపంలో విద్యుత్ స్తంభాన్ని లారీ డి కొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోటు చేసుకుంది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిత్తూరు జిల్లా పీలేరు నుండి తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ కు మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐచర్ లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని డి కొని పల్టీలు కొట్టింది.ఈ ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్ కుతుబుద్దిన్, క్లీనర్ దత్తు తీవ్రంగా గాయపడ్డారు.వీరిని 108లో ఆళ్ళగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఈ ప్రమాదం.జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై విద్యుత్ శాఖకు తెలియజేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా తృటిలో పెను ప్రమాదం తప్పింది.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## శ్రీబసవేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి 108 బిందెలతో జలాభిషేకం జలాభిషేకం



**నందవరం జులై 12 (ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలో సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండటంతో నందవరం రైతులు, యువకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ స్థానిక బసవేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. మహిళలు కలశాలతో, మేళతాళాల మధ్య సుమారు 200కు పైగా ఎద్దులను అలంకరించి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వెలసిన దేవతామూర్తులకు రైతులందరూ ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం వరుణయాగం.......

**ఘట్టాబిషేకం జలంతో నిండిన రామలింగేశ్వర స్వామీ........**





**చాగలమర్రి , జులై 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ చాగలమర్రి పట్టణంలోని రామలింగేశ్వరస్వామీ (పాత శివాలయం) ఆలయంలో మండల పర్టిలైజర్స్‌డ పెస్టిసైడ్స్ దుకాణాల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వరుణయాగం నిర్వహించారు. వేదపండితులు కిషోర్‌శర్మ ప్రసాద్‌శర్మ, పవన్‌శర్మ,యజ్వాశర్మలు వేద మంత్రోచ్చారణాలతో 1008 బిందెలతో రామలింగేశ్వర స్వామీకి ఘట్టాభిషేకం,గణపతి హోమం కలశపూజ, పూర్ణాహుతి, మహారుద్రాభిషేకం, శిఖర కుంభాభిషేకం,గణపతి హోమం వరుణయాగం చేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వరుణుడు కరుణించి వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు,ప్రజలు సుభిక్షముగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విజయ్ శేఖర్,ఏఓ రంగనేతాజీ,ఆలయ చైర్మన్ వీరంరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి,పర్టిలైజర్స్‌డపెస్టిసైడ్స్ దుకాణాల యజమానులు,తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాడ శివాలయంలో వైభవంగా అన్నాభిషేకం:

**అన్నదాత సుఖీభవ' అంటూ ప్రత్యేక పూజలు**



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** దుర్గాడ గ్రామంలో వేంచేసియున్న ప్రసిద్ధ శివాలయంలో సోమవారం అన్నాభిషేక మహోత్సవం కన్నులపండువగా జరిగింది. మాస శివరాత్రి, ఆర్ద్ర నక్షత్రం, సోమవారం కలసి వచ్చిన అత్యంత విశేష పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరుల ఆధ్వర్యంలో ఉదయం నుంచే పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి మహాగణపతి పూజ, మహన్యాస పారాయణ ఘనంగా చేశారు. అనంతరం పరమేశ్వరుడికి ప్రీతికరమైన 21 రకాల ద్రవ్యాలు, సుగంధ జలాలతో విశేష అభిషేకాలు జరిపారు.

**121 కేజీల అన్నంతో అభిషేకం:**

ఈ పర్వదినం సందర్భంగా భక్తుల సహాయ సహకారాలతో 121 కేజీల బియ్యంతో వండిన అన్నాన్ని పరమేశ్వరునికి సమర్పించి, అత్యంత వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం, సమాజ శ్రేయస్సు కోసం ఈ పూజలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా దేశానికి వెన్నెముక అయిన అన్నం పండించే రైతులు, వ్యవసాయదారులు పాడిపంటలతో వర్ధిల్లాలని, 'అన్నదాత సుఖీభవ' అనే సంకల్పంతో అన్నదాత ప్రాముఖ్యతను చాటిచెప్పేలా ఈ విశేష అన్నాభిషేకం నిర్వహించామని వారు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మాకివలస నుండి గంగు రామన్నగూడ వరకు బి.టి రోడ్డుని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం.**గిరిజన ప్రాంతాలకు ఎన్నడూ లేని రహదారి సౌకర్యాలు... కూటమి ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి కొత్త దిశ చూపుతున్న ఎమ్మెల్యే ఎంజీఆర్ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 70.00 లక్షల రూపాయిల వ్యయంతో నిర్మాణం పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలంలోని మాకివలస నుంచి గంగు రామన్నగూడ వరకు నిర్మించిన బి.టి రోడ్డుని నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 70.00 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ రహదారి గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడంతోపాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు సులభంగా మార్కెట్లకు తరలించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని,గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.నియోజకవర్గం అభివృద్ధి తన ధ్యేయమని, ప్రజలకు మరింత చేరువుగా మెరుగైన సేవలు అందించే దిశగా నిరంతరం కృషి సాగిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 99 శాతం సర్ పూర్తి

**డిజిటలైజేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్......**



**చాగలమర్రి , జులై 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;**మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రిక్రియను 99 శాతం పూర్తి అయ్యిందని తహసీల్దారు పణీంద్రుడు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని మూడవ సచివాలయంలో బిఎల్‌ఓలు చేస్తున్న సర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించి తగు సూచనలు,సలహాలను ఇచ్చారు. గడువు తేది అయిన ఈ నెల 14 నాటికి వంద శాతం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేసారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ తారకేశ్వరి,తహసీల్దారు కార్యాలయ జూనియర్ సహాయకురాలు మౌనిక,బిఎల్‌ఓలు పెద్దయ్య,కార్యదర్శి ఎస్తేర్,రాము తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పథం' ద్వారా గ్రామలో పరిశుభ్రత



**నందవరం జులై 13(ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో ని ఇబ్రహీంపురం గ్రామంలో స్వచ్ఛ పథం' ద్వారా ఉదయం 6 నుంచి 10 గంటల లోపు వ్యర్థాలను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి అందుబాటులో ఉన్న సంపద కేంద్రాలకు తరలించేందుకు అలాగే కాలువలు పూడిక తీత పనులు చేపడుతున్నామని మాజీ సర్పంచ్ అభ్యర్థి నరసింహులు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ పెద్దిరెడ్డి స్వచ్ఛ పథం' ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామ పంచాయతీల్లో వసతుల కల్పనతోపాటు రహదారులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వం 'స్వచ్ఛ పథం' పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందిని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పంచాయతీలకు నిధుల కేటాయింపుతోపాటు అభివృద్ధి, శుభ్రతపై దృష్టి సారించింది. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులకు గ్రామం లో పరిశుభ్రతగా ఉంచుతామన్నారు.

## డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా డాక్టర్ బి బాలకృష్ణ



**ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్ :**ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా డాక్టర్ బి బాలకృష్ణ సోమవారం నాడు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంచికచర్ల డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తూ సుదీర్ఘ అనుభవం కలిగిన పరిశోధనల్లో విశేష ఖ్యాతి గడించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆమదాలవలస నూతన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. కళాశాల అభివృద్ధి , విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం కోసం అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సహకారంతో కృషి చేస్తామన్నారు. నూతన ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బాలకృష్ణ కు కళాశాల అధ్యాపకులు బోధనేతర సిబ్బంది విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# వైభవంగా విజయేంద్రతీర్థుల ఆరాధన ఉత్సవం





## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**హోళగుంద, జూలై 13, ప్రజా జ్యోతి న్యూస్** -హోళగుంద మండల కేంద్రంలోని కోట ఆంజనేయ స్వామి దేవాలయం నందు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురువు అయిన విజయేంద్ర తీర్థుల 412 వ ఆరాధనోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ముగిసాయి. బ్రాహ్మణ అర్చకులు పాండురంగాచారి, మురళీధర్ ఆచారి, వెంకటేష్ ఆచారి, రంగనాథ ఆచారి, రాఘవేంద్ర పవన్ ఆచారిల ఆధ్వర్యంలో ఆరాధనో త్సవ కార్యక్రమాలను మండల కేంద్రం హోళగుంద నందు గత నాలుగు రోజుల నుండి ఉత్తరాదన కార్యక్రమం నుండి మధ్యరాధన, పూర్వరాధన కార్యక్రమంతో విజయేంద్రతీర్థుల ఆరాధన ఉత్సవాలు వైభవంగా ముగిసినట్లు వారు తెలియజేశారు. విజయేంద్రతీర్థుల విగ్రహాన్ని రథోత్సవం పై ప్రతిష్టించి హోళగుంద పురవీధుల గుండా మేళ తాళాలతో చిన్నారుల కోలాట నృత్యంతో, భజన కార్యక్రమాలతో రథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజయేంద్రతీర్థుల ఆరాధనోత్సవ కార్యక్రమాలు హోళగుందలో నిర్వహించిన అనంతరం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం నందు నిర్వహించడం ప్రత్యేకత. అదేవిధంగా రాఘవేంద్ర స్వామి గురువు అయినటు వంటి విజయేంద్రతీర్థుల బృందావనం భారతదేశంలో హోళగుంద తో పాటు, తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో మాత్రమే ఉండడం తో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుండి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయేంద్ర తీర్థుల ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా ప్రతి ఏడాది నిర్వహించడం ఆన వాయితీ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

## నిరుపేదలకు ఆర్థిక చేయూత అందించడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుంది

: ప్రభుత్వ విప్ యనమల దివ్య
రూ. 10.17 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ
తేటగుంట క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేత



**కాకినాడ జిల్లా తుని (తేటగుంట): (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, నిరుపేదలకు ఆర్థిక చేయూత అందించడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాల బారిన పడి, వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరమని ఆమె కొనియాడారు. తేటగుంటలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ఆమె తొమ్మిది మంది బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10,17,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు మరియు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ (ప్రజా జ్యోతి)** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదులపై అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా స్పందించాలని, నిర్దేశిత కాలపరిమితిలోగా వాటికి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రజల నుండి కలెక్టర్ నేరుగా అర్జీలను స్వీకరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి మొత్తం 392 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, అధికారులు ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కేవలం ఏదో ఒక సమాధానంతో అర్జీలను ముగించడం కాకుండా, దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించి నివేదికలు సమర్పించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం , సంక్షేమానికి కృషి చేస్తాం

జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణ రావు , ప్రత్యేక ఆహ్వానితుడు మురళీ కృష్ణ పట్నాయక్
- ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షుడిగా డి రాజశేఖరం , కార్యదర్శిగా వై రాజేష్ ఎన్నిక




**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం పొందూరు శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం నాడు స్తానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఎన్నికల అధికారిగా జిల్లా పరిషత్ జూనియర్ అసిస్టెంట్ పైడి నాగేశ్వర రావు వ్యవహరించారు. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా జి సిగడాం మండల పరిధికి చెందిన డి రాజశేఖరం (సీనియర్ అసిస్టెంట్ ) ,సహాధ్యక్షుడిగా ఎచ్చెర్ల కు చెందిన జి శ్రీనివాస రావు (సీనియర్ అసిస్టెంట్ ,పంచాయతీ రాజ్ శాఖ) కార్యదర్శిగా ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయానికి చెందిన వై రాజేష్ ( టైపిస్ట్ జాయింట్ సెక్రటరీగా డి బొండపల్లి చెందిన ఆర్ మధుసూదన రావు ( రికార్డు అసిస్టెంట్ ) ,ట్రెజరర్ గా సంతకవిటి మండలం జెడ్పీ.హెచ్.ఎస్ కు చెందిన ఎన్ రవికుమార్ ( రికార్డు అసిస్టెంట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కౌన్సిలర్ -1 గా కొత్తపేట కు జెడ్పీహెచ్.ఎస్ కు చెందిన సి. హెచ్ అనిల్ కుమార్ (రికార్డు అసిస్టెంట్ ), జిల్లా కౌన్సిలర్ -2 గా తోలాపి జెడ్పీ.హెచ్. ఎస్ కు చెందిన ఆర్ శ్రీనివాస రావు (రికార్డు అసిస్టెంట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణ రావు ప్రత్యేక ఆహ్వానితుడిగా మురళీ కృష్ణ పట్నాయక్ హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం , సంక్షేమం సంఘ బలోపేతానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు సభ్యులందరి సహకారంతో ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామన్నారు.

## కౌతాళంలో పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం గ్రామసభ

**కౌతాళం జూలై 13 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో సోమవారం రోజున గ్రామసభ నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సభల పాత్ర సర్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. వీటిలో ఓటర్ల జాబితాను చదివి వినిపించి, మరణించిన వారిని లేదా శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి అనుమతి తీసుకుంటారు. ముఖ్య ఉద్దేశ్యం 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం మరియు నకిలీ లేదా డూప్లికేట్ ఓట్లను తొలగించడం ద్వారా పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. బీఎల్ఓల సర్వే బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ తిరిగి ఓటర్ల సమగ్ర వివరాలను,అర్హుల వివరాలను సేకరిస్తున్నారు. ఫారాల సమర్పణ కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాల కోసం ఫారం-7, వివరాల సవరణ కోసం




ఫారం-8 లను ఉపయోగించుకోవాలి. ఈ ఫారాలను మీ సచివాలయంలో బూత్ స్థాయి అధికారికి గానీ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ సమర్పించాలి. ఓటర్ల నమోదుకు సంబంధించిన పూర్తి సమాచారం మరియు మార్గదర్శకాలను భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్




సీఈఓ ఆంధ్ర ప్రదేశ్ లేదా ఓటర్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు అనే ఈ గ్రామ సభలో తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి, మరియు బూత్ లెవెల్ ఆఫీసర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏ.బీ.సీ.డీ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందిన వృద్ధుడికి అంతిమ యాత్ర నిర్వహించిన ఏ.బీ.సీ.డీ బృందం

**అనంతగిరి మండలం జూలై 13. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. విజయనగరం జిల్లాఏ.బీ.సీ.డీఅసోసియేషన్ ఫోర్ బ్రైట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సోమేశ్వరరావు69. సంవత్సరాలుఅనారోగ్య కారణాలతో సోమవారంమృతి చెందాడు ఐదు రోజులుగా పక్షవాతం. ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్యంతో మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి, విజయనగరంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని ఆసుపత్రి నుండి తీసుకువచ్చి, హిందూ సంప్రదాయాల ప్రకారం ఏ.బీ.సీ.డీ నిర్వాహకులు.సిబ్బంది మరియు సభ్యులు కలిసి ఆయనకు ఘనంగా అంతిమ యాత్ర నిర్వహించి, చివరి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏబీసీడీ అధ్యక్షులుఎ. సన్యాసి నాయుడు మాట్లాడుతూ, “ఏ.బీ.సీ.డీ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయ వృద్ధులకు ఆహారం, నివాసం, దుస్తులు, వైద్య సేవలు మాత్రమే కాకుండా, వారు మరణించిన అనంతరం వారి మతాచారాలు, సంప్రదాయాలకు అనుగుణం గా గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం కూడా మా సేవలో భాగమే. సమాజంలో ఎవరూ అనాథగా మిగలకుండా చివరి ప్రయాణం వరకు సేవ చేయడం మా సంస్థ ధ్యేయం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.బీ.సీ.డీ నిర్వాహకులు, సిబ్బంది, స్థానికులు పాల్గొని మృతునికి ఘన నివాళులు




అర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ఫిర్యాదు రాగానే మేల్కొన్న చెరువులు



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,జులై 13 :** మండలంలోని వింజరం పంచాయితీలో ఉపాధి చెరువుల పనులపై ఫిర్యాదు అందిన క్రమంలో తప్పును కప్పిపుచ్చుకునేందుకు సిబ్బంది నిమగ్నమయ్యారు. మొన్న సాకలి చెరువు,నేడు దుర్గయ్య చెరువు. దుర్గయ్య చెరువులో నిధులు మే నెల తోనే పని చేయకుండానే స్వాహా అయ్యాయి. ఈ క్రమంలో చెరువులపై ఫిర్యాదు అందిన వెంటనే,చేయని పనిని చేసినట్టు చూపించటం కోసం కూలీలను పెట్టి సోమవారం చేపించారు. ఇప్పటికే ఆ చెరువులో నిధులు అయిపోయాయి. అయిపోయిన చెరువులో ఏ విధంగా పని చేస్తారు?ఇదంతా చేసిన అక్రమాలను సరి చేసుకునేందుకు చేసే మరో తప్పుడు పనులు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే క్రమంలో తొండిపాక పంచాయితీ చెరువులో జరిగిన అవినీతి పై ఎఫ్ఏ,టీఏ సస్పెండ్ అవ్వడంతో అధికారుల్లో,సిబ్బంది లో ఓ రకమైన అలజడి మొదలైంది. కనీసం కొద్దిగానైనా పనులు చేసినట్టు చూపెట్టటం కోసం కూలీలను తెచ్చి చేపిస్తున్నారు. కట్టకు మట్టి తట్టలతో మహిళలు పోయటం చూశాం. కానీ, వంచల తో భుజాన మోయటం అదికూడా కేవలం తొమ్మిది మంది పురుషులులతో చేపించటం చూస్తే,ఈ పని కప్పిపుచ్చుకునేందుకే అని స్పష్టం అవుతోంది. అంతకన్నా ముందే చెరువుల భవితవ్యం చేరాల్సిన చోటుకు చేరిందనేది గోప్యతలో స్పష్టంగా ఉంది. చూద్దాం తప్పుకు ఎన్ని తప్పులు అనేది త్వరలోనే తేలనుంది.

## గొల్లప్రోలులో ప్రజా సమస్యలపై 'గుండ్ర సుబ్బారావు' మెరుపు స్పందన!



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ప్రజా సమస్యల పరిష్కారంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని గొల్లప్రోలు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు మరోసారి నిరూపించారు. గొల్లప్రోలు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం పక్కన మురికి కాలువల్లో పూడికలు పేరుకుపోయి, డ్రైనేజీ నీరంతా రోడ్డు మీదకు ప్రవహిస్తున్న ఉదంతంపై ఆయన తక్షణమే స్పందించారు. కొన్ని రోజులుగా ఈ మురికి నీటి వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు, ముఖ్యంగా పిల్లలు, నరకాన్ని అనుభవిస్తున్నారు. ఈ సమస్య తీవ్రతను గమనించిన గుండ్ర సుబ్బారావు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా రంగంలోకి దిగారు. సమస్య తీవ్రతపై గుండ్ర సుబ్బారావు తక్షణమే మున్సిపల్ కమిషనర్ తో కలిసి ఆ ప్రాంగణం ని పరిశీలించారు. మరియు ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రావడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను, వ్యాధులు ప్రబలే ప్రమాదాన్ని వారికి వివరించారు. అవసరమైతే తాత్కాలిక మరమ్మతుల తో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారంగా కొత్త డ్రెయిన్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

### సొంత నిధులు ఖర్చు చేయడానికైనా సిద్ధం గుండ్ర సుబ్బారావు ఉదారత

ఈ సందర్భంగా గుండ్ర సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. “ప్రభుత్వ నిధుల మంజూరుకు సమయం పడితే, ప్రజలు ఈ మురికి నీటి కష్టాలు పడకూడదు. అవసరమైతే ఈ డ్రైనేజీ పనుల నిమిత్తం నా సొంత డబ్బులైనా ఖర్చు పెట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ ప్రజల ఆరోగ్యం, రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు” అని ఆయన సంచలన ప్రకటన చేశారు. ఆయన చూపిన ఈ ప్రజాసేవా తత్పరత, ఉదారత అక్కడున్న ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.

### జేజేలు పలుకుతున్న పట్టణ ప్రజలు

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్వయంగా దగ్గరుండి పనులు చేయిస్తూ, అవసరమైతే జేబు నుండి డబ్బులు పెట్టడానికైనా వెనుకాడని గుండ్ర సుబ్బారావు నాయకత్వాన్ని గొల్లప్రోలు పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కొనియాడుతున్నారు. ఇలాంటి నిబద్ధత గల నాయకులు ఉండటం గొల్లప్రోలు ప్రజల అదృష్టమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరిచిన కృష్ణవేణి స్కూల్ విద్యార్థి





ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మరియు ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం సేలం నందు గల మహాత్మ గాంధీ ఇండోర్ స్టేడియంలో జూన్ 26 నుండి 28 వరకు జరిగిన 14వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ నందు అనంతపురం జిల్లా పామిడి కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు 4 వ తరగతి చదువుతున్న తలారి సత్యబ్రూస్లీ సబ్ జూనియర్ బాయ్స్ అండర్-16కేజీ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్. అనురాధ రెడ్డి ఇంచార్జ్ శశికళ సత్యబ్రూస్లీని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్ అనురాధ రెడ్డి మాట్లాడుతూ పామిడి మండలంలోనే తమ స్కూల్ నందు తైక్వాండో శిక్షణతో పాటు యోగ మరియు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. పిల్లలకు విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ తులసిరామ్, పిఈటీ మల్లికార్జున మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ విశ్వక్సేన్

- జన్మదిన వేడుకల్లో పాల్గొన్న తూర్పు కాపు నేత మక్కా



**లావేరు , ప్రజాజ్యోతి న్యూస్ :** జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఎచ్చెర్ల జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ విశ్వక్సేన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన సోదరుడు వినీల్ ఆధ్వర్యంలో లావేరు పార్టీ కార్యాలయంలో జన సైనికుల మధ్య వైభవంగా జరిగింది. ఈ జన్మదిన వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు , తూర్పు రాష్ట్ర అధ్యక్షులు మక్కా సాయిబాబు నాయుడు పాల్గొని, జనసైనికులు మధ్య శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం అందరు కలిసి మెలసి పనిచేయాలని కోరారు. అందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగితే జనసేన పార్టీ మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొంతు విజయ్ కృష్ణ ,తమ్మినేని శ్రీనివాస్, పాకాల కిషోర్ ,వద్దాది శ్రీనివాసరావు ,కే పవన్ డి రవీంద్ర ,కాకర్ల బాబాజీ ,పైడా యి వలస శ్రీను పాల్గొన్నారు. అనంతరం జి సిగడం. మండల కేంద్రం లో భారత్ పెట్రోల్ బంకు వద్ద జనసైనికులు కేకు కట్ చేసి విశ్వక్సేన్ కు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ జన్మదిన వేడుకలు కార్యక్రమంలో పొగిరి అప్పలనాయుదదు,మండ గురయ్య ,గేదెల రామకృష్ణ పైలా శివ , పెద్ది సతీష్ , పిఏసిఎస్. డైరెక్టర్ పోతల చిరంజీవి, పెద్ది దుర్గారావు, మచ్చ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## హరహర మహాదేవ్ నినాదాలతో మారుమోగిన మల్లవరం..

శ్రావణ సోమవారం శ్రీ దుర్గా మల్లేశ్వరునికి భక్తుల పోటెత్తిన రద్దీ



**మల్లవరం:** శ్రావణ మాస పవిత్ర సోమవారం సందర్భంగా మల్లవరం గ్రామంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం శివాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఎన్నో ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ విశిష్టమైన శ్రావణ సోమవారం రోజున అభిషేకం చేసి స్వామివారిని దర్శించుకుంటే విశేష పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా "హర హర మహాదేవ", "ఓం నమః శివాయ" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా జన్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు దంపతులు సుమారు 50 మంది భక్తులకు భోజన పొట్లాలను పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని ఏర్పాట్లను విజయవంతం చేశారు.

## పెద్దసీది రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా, డి.ఎ.పి పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్.




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలం పెద్దసీది రైతు సేవా కేంద్రం వద్ద ఈరోజు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు రైతులకు యూరియా, డి.ఎ.పి ఎరువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది,ఎన్డీఏ కూటమి నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుల్లేని గొల్లప్రోలు టోల్ ప్లాజా పట్టించుకోని కాంట్రాక్టర్









**-భయాందోళనలో వాహనదారులు**

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద గడచిన కొన్ని నెలలుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.టోల్గేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లతో పాటు,జాతీయ రహదారి వెంబడి ఉన్న ఇతర వీధి దీపాలు పూర్తిగా అచేతనంగా మారాయి.దీంతో రాత్రి వేళల్లో నిత్యం టోల్ ప్లాజా సమీప ప్రాంతమంతా చీకటి అలుముకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.నిత్యం వేలాది వాహనాల నుండి లక్షలాది రూపాయల టోల్ ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యం వాహనదారుల కనీస సౌకర్యాలను గాలికొదిలేసిందని విమర్శలు వినిపిస్తున్నాయి.రహదారి వెంబడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ బిల్లులు అధికంగా వస్తున్నాయనే నెపంతోనే టోల్గేట్ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా లైట్లు వేయడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ వాహనదారులకు సౌకర్యాలు కల్పించడంపై లేదని మండిపడుతున్నారు.స్థానికులు లైట్లు వేయమని కోరుతున్నా టోల్ ప్లాజా నిర్వాహకులు తమను లెక్కచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.నెలలు తరబడి లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పై ప్రయాణికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రయాణికుల ప్రాణాలు గాలికి వదిలేసిన గొల్లప్రోలు టోల్ ప్లాజా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**దేంజర్ జోన్గా మారిన జంక్షన్లు**

బైపాస్ రోడ్డు నుండి గొల్లప్రోలు ఊర్లోకి వెళ్లే ప్రధాన జంక్షన్ వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ రాత్రి సమయంలో వెలగకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ప్రతిరోజు రాత్రి వేళల్లో ఈ జంక్షన్లో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.టోల్ ప్లాజా కు అటు,ఇటు పిఠాపురం, గొల్లప్రోలు వైపుగా వెళ్లే దారులన్నీ చీకటిమయంగా మారడంతో రాత్రి వేళల్లో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. సౌర విద్యుత్తుతో వెలిగే ఒకటి రెండు దీపాలు మినహా మిగిలినవన్నీ పనిచేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు,టోల్ ప్లాజా యాజమాన్యం స్పందించి తక్షణమే విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# మహిళల సమస్యలకు ఉద్యమాలే మార్గం ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి

**కూనవరంలో ఘనంగా ఐద్వా రెండో మండల మహాసభ**

**--భారీ ర్యాలీ మానవహారం**





**కూనవరం, జూలై 13 ప్రజా జ్యోతి** మహిళల హక్కుల పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి పిలుపునిచ్చారు. కూనవరంలో జరిగిన ఐద్వా రెండో మండల మహాసభ అనంతరం మహిళలు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించి తమ డిమాండ్లను వినిపించారు.మహాసభలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, అధ్యక్షురాలిగా గుండం బుచ్చమ్మ, కార్యదర్శిగా అమ్మాజీ, కోశాధికారిగా నాగమణి ఎన్నికయ్యారు. పాముకాటుతో మృతి చెందిన సమ్మక్క ప్రియ కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం, ఆర్థిక సహాయం అందించాలని నేతలు డిమాండ్ చేశారు.పోలవరం నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు, వరదలతో ఉపాధి కోల్పోయే కుటుంబాలకు నాలుగు నెలల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని కోరారు. మహిళలకు అన్ని ప్రజాప్రతినిధి సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మహాసభ తీర్మానించింది. కార్యక్రమంలో మహిళా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పొందూరులో ఎరువుల పంపిణీ అధికారుల పర్యవేక్షణ

- దల్లవలస , తండ్యాం గ్రామాల్లో తనిఖీలు
- రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయాలని ఆదేశాలు



**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండలంలో రైతులకు రబీ సీజన్ కు అవసరమైన ఎరువుల పంపిణీ ప్రక్రియను అధికారులు సోమవారం నాడు పర్యవేక్షించారు. దల్లవలస గ్రామంలోని రైతు సేవా కేంద్రం ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీని రణస్థలం వ్యవసాయ సహాయకులు వి శ్రీనివాస రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంపిణీ విధానం , అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా తండ్యాం గ్రామంలోని ఎరువుల పంపిణీ కేంద్రంతో పాటు శ్రీ కృష్ణ రైతు డిపో ను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఎరువులు తగిన నిల్వలో ఉన్నాయా ,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరుగుతుందా అనే అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోండా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి ఎం శ్రీనివాస బాబు , వి. ఏ. ఏ దల్లవలస కె సుధీర్ , ఏ.ఈ.ఓ మలకాం ఎస్ లీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ కె. అనిత నియామకం



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి) ప్రతినిధి. బోర శివా రెడ్డి.** కాకినాడ జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గా డాక్టర్ కె. అనిత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన డీఎంహెచ్ఓ స్థానంలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.డాక్టర్ అనితకు వైద్య రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. దీనికి ముందు ఆమె శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. అక్కడ ఆమె అందించిన సేవలకు గానూ మంచి గుర్తింపు లభించింది.కాకినాడ జిల్లా డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ అనితకు పలువురు వైద్య అధికారులు, సిబ్బంది ముందస్తు అభినందనలు తెలియజేశారు. జిల్లాలో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, ప్రభుత్వ ఆరోగ్య పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఆమె కృషి చేయనున్నారు.

## ప్రధానో వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలం బూరగాం గ్రామానికి చెందిన గణేష్ ప్రధానో పద్మ దంపతుల కుమారుడు సుమంత్ మిట్టుడ బనిత సోనాలి వివాహ మహోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు మామిడి గోవిందరావు . ఎమ్మెల్యే గారితో పాటు స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్కూల్ నేల ఆరోగ్య పథకము (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం) లో భాగముగా మట్టి నమూనాలు తీసే విధానం, ల్యాబ్ లో పరీక్ష చేసే విధానం, మట్టి నమూనాలు ఆవశ్యకత ఉ సమస్యాత్మక పొలాలకు పరిస్కారాలు గురించి పాతపట్నం లో గల పీఎంశ్రీ ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు శిక్షణ మరియు అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి వై సురేష్, పాతపట్నం మండల వ్యవసాయ అధికారి కె. సింహాచలం, కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస మట్టి పరీక్ష కేంద్రం ప్రోగ్రాం అసిస్టెంట్ శ్రీ. ఆర్. కిషోర్, పాతపట్నం గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, స్కూల్ హెచ్ఎం , సైన్స్ టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే అమిలినేని

**జియాలాజిస్ట్ ను పంపి వెంటనే బోరు వేయించేలా ఏర్పాటు..**



**కంబదూరు జూలై 13:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**కంబదూరు మండల పరిధిలోని తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినీలు నీటి కోసం గత రెండు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఉదయమే స్థానిక, మండల నాయకులను పంపి పరిస్థితి అడిగి తెలుసుకోవడమే కాకుండా తక్షణం స్పందించి ట్యాంకర్లు పంపి నీటిని అందించడం జరిగింది.బోరు వేయించే వరకు నీటిని ట్యాంకర్ల ద్వారా అందించామని స్కూల్ కమిటీ చైర్మన్ కు చెప్పడం జరిగింది. కేవలం అక్కడితోనే ఆగకుండా శాశ్వత పరిష్కారం చూపేల జియాలాజిస్ట్ ను పంపి ఒకటి కాకుండా మూడు లేదా నాలుగు బోరు పాయింట్లు పెట్టించాలని, పాయింట్ పెట్టిన వెంటనే బోరు వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది..విద్యార్థునులకు ముందు ముందు నీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలియజేశారు.

## జి యస్ రావు చిత్రపటానికి నివాళి అర్పించిన ఎస్ రాజీవ్ కృష్ణ



**తాళ్లపూడి, జూలై 13, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి ఎస్ రావు మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుమారుడు మాజీ ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన టీడీపీ యువ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ రాజీవ్ కృష్ణ ఈ సందర్భంగా రాజీవ్ కృష్ణ మాట్లాడుతూ జి యస్ రావు ప్రజాసేవకు ఆదర్శంగా నిలిచారని ఆయన ప్రజల కోసం చేసిన సేవలు రాజకీయాల్లో చూపిన నిబద్ధత చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు

వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్కూల్ నేల ఆరోగ్య పథకము (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం) లో భాగముగా మట్టి నమూనాలు తీసే విధానం, ల్యాబ్ లో పరీక్ష చేసే విధానం, మట్టి నమూనాలు ఆవశ్యకత సమస్యాత్మక పొలాలకు పరిస్కారాలు గురించి పాతపట్నం లో గల పీఎంశ్రీ ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు శిక్షణ మరియు అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీ వై సురేష్, పాతపట్నం మండల వ్యవసాయ అధికారి శ్రీ. కె. సింహాచలం, కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస మట్టి పరీక్ష కేంద్రం ప్రోగ్రాం అసిస్టెంట్ శ్రీ. ఆర్. కిషోర్, పాతపట్నం గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, స్కూల్ ఎవీ, సైన్స్ టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని రాయచోటి ఆర్డీఓకు సిపిఐ వినతిపత్రం

**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)**



**రాయచోటి జూలై 13 ప్రజా జ్యోతి** రాయచోటి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ప్రజలకు తగిన సమయం కల్పించే విధంగా గడువును పొడిగించాలని కోరుతూ ఈరోజు రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసుల కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అనేక మంది ప్రజలు అవసరమైన పత్రాలు సేకరించడం, దరఖాస్తులు పూర్తి చేయడం వంటి విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు, వృద్ధులు, కార్మికులు మరియు నిరుపేదలు గడువు తక్కువగా ఉండటంతో తమ దరఖాస్తులను పూర్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎస్ఐఆర్ గడువును మరికొంత కాలం పొడిగించి ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలని ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాయచోటి నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు వంగి మల్ల రంగారెడ్డి, చుక్క జగన్‌బాబు, బత్తల వెంకటరమణ, పి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మెమో-57 బాధితులకు చారిత్రాత్మక న్యాయం

**– కూటమి ప్రభుత్వానికి జిల్లా కన్వీనర్ శ్రీహరి కొత్తకోట కృతజ్ఞతలు**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** మెమో–57 సమస్య పరిష్కారం కోసం శ్రీకాకుళం జిల్లాలో గత దశాబ్దకాలంగా నిరంతర పోరాటాలు, వినతిపత్రాలు, ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో కూడా ఉద్యమాన్ని విస్తృతం చేసిన ఫలి తంగా, మెమో–57 అమలుకు మార్గం సుగమమైంది.ఈ క్రమంలో గత నెల 23వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం మెమో–57 అమలుకు ఆమోదం తెలపడం, అనంతరం ప్రభుత్వం సంబంధిత జీవోను విడుదల చేయడం రాష్ట్రవ్యాప్తంగా మెమో–57 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని జిల్లా కన్వీనర్ శ్రీహరి కొత్తకోట కృతజ్ఞత లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,715 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ ప్రయోజనాన్ని పొందనుండగా, శ్రీకాకుళం జిల్లాలో కూడా సుమారు 800 వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు లబ్ధి పొందనున్నాయన్నారు.దీర్ఘకాలంగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న మెమో–57 బాధితులకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను అందించే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామున్నారు.అలాగే ఈ సమస్య పరిష్కారానికి తమ వంతు సహకారం అందించిన గౌరవ ఎమ్మెల్సీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యమంలో ప్రత్యక్షంగా , పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ విషయాన్ని 2003 డీఎస్సీ ఏపీ ఫోరం శ్రీహరి తెలిపారు.

## పాతపట్నం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్:-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి అధికారులకు ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదేశం. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఎంజిఆర్ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి ఎమ్మెల్యే ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్యే , రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది హాజరు, అవసరమైన మందుల లభ్యత, వైద్య పరికరాలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రిలో మందుల కొరత, సిబ్బంది లోపం లేదా ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే గారు ఆదేశించారు.

## వాట్సాప్ సేవలను వినియోగించుకోండి: ఎంపీడీవో ఫజల్ రహమాన్




**బేతంచెర్ల, జూలై 13(ప్రజా జ్యోతి)**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బేతంచెర్ల ఎంపీడీవో ఫజల్ రహమాన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో ఫజల్ రహిమాన్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో, ఎంపీపీ లు మాట్లాడారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 9552300 009 వాట్సాప్ నంబర్‌కు “హాయ్” అని సందేశం పంపితే సంక్షేమ పథకాల వివరాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు, సమాచారం పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరుపై నివేదికలు సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివలక్ష్మి, వెటర్నరీ ఏడి రామసుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ డి.టి. మహేష్, హౌసింగ్ ఏఈ కేశవ్, ఏఓ విజయకుమార్ రెడ్డి, ఏపీఓ విజయరాణి, అంగన్‌వాడీ సూపర్వైజర్ రాధా, డాక్టర్ అబ్దుల్ అలీమ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌కు వెళ్లేందుకు నిరాకరించిన బాలుడు.. చాకచక్యంగా గుర్తించిన బేతంచర్ల పోలీసులు



**బేతంచర్ల, జూలై 13,(ప్రజా జ్యోతి)** హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడక తల్లి నుంచి తప్పించుకుని వెళ్లిపోయిన 13 ఏళ్ల బాలుడిని బేతంచర్ల పోలీసులు చాకచక్యంగా గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజామల మండలం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సోగాలా ధనుష్ (13), రామ్మోహన్ కుమారుడు. వారం క్రితం బాలుడిని అతని తల్లి ఎంజేపీ పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించారు. అయితే హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడని బాలుడు ఇంటికి వెళ్లాలని కోరడంతో, అతని తల్లి సిమెంట్ నగర్‌లో ఉన్న బాలుడి పెద్దమ్మ ఇంటి వద్ద ఉంచారు.సోమవారం ఉదయం బాలుడిని సిమెంట్ నగర్ నుంచి తిరిగి పాఠశాలకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో తల్లి నుంచి తప్పించుకుని పారిపోయాడు. కొద్దిసేపటికే బాలుడు బేతంచర్ల బస్టాండ్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో బేతంచర్ల పోలీసులు వెంటనే స్పందించి బాలుడిని సురక్షితంగా గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై బేతంచర్ల సీఐ డి. వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై రమేష్ బాబు బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, బాలుడికి మరియు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హాస్టల్ విద్య ప్రాముఖ్యత, బాలుడి మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు సహనంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.బాలల భద్రత విషయంలో అప్రమత్తంగా వ్యవహరించిన బేతంచర్ల పోలీసుల తీరును స్థానికులు అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో మార్మోగిన బుట్టాయిగూడెం శివాలయం

**మాస శివరాత్రి సందర్భంగా భక్తుల పోటెత్తిన రద్దీ**

**ఘనంగా అన్నదాన కార్యక్రమం**





**ఎటపాక, జూలై 13 (ప్రజాజ్యోతి):** ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శివాలయంలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

**ప్రత్యేక అభిషేకాలు -- భక్తిశ్రద్ధలతో పూజలు**

స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. పర్వదినం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**భక్తులకు అన్నప్రసాదం -- దాతల సేవాభావం**

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నెల్లిపాక గ్రామానికి చెందిన రెడ్డి రమేష్--అనసూయ దంపతులు, రెడ్డి రవికుమార్--భారతి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. గన్నవరం గ్రామానికి చెందిన రావుల కొండయ్య భక్తులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి సోమవారం అన్నదానం కొనసాగింపు భక్తుల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థులకు ఘనంగా ఓరియెంటేషన్ కార్యక్రమం






ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్

**రాయచోటి జూలై 13 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటిలోని లిశ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లిలో సోమవారం మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థినీ, విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, విశిష్ట అతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కె. రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం, ఈవ్ టీజింగ్ వంటి చట్టవిరుద్ధమైన, అనాగరిక చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. రూరల్ సీఐ చలపతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని కష్టపడి చదివి తమ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్రిమినల్ కార్యకలాపాలకు దూరంగా ఉండడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కె. రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. అపజయాల ను చూసి నిరుత్సాహపడకుండా వాటిని విజయానికి సోపా నాలుగా మలుచుకోవాలని, మంచి ఆలోచనలు, సానుకూల దృక్పథం, నిరంతర శ్రమతో జీవితంలో ఆశించిన శిఖరాలను చేరుకోవచ్చని ప్రేరణనిచ్చారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవభావంతో మెలుగుతూ, సాంకేతిక నైపుణ్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను ప్రయోగశాలల్లో ఆచరణాత్మకంగా అవగాహన చేసుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, స్మార్ట్ స్కిల్స్‌లో ప్రావీణ్యం సాధించి తమ లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి అనంతరం తీసుకునే నిర్ణయాలే విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు చిన్న వయస్సులోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. రైల్వే, ఆర్మీ, గెయిల్, ఓఎన్‌జీసీ, డీఆర్‌డీఓ, బెల్, మహారత్న, నవరత్న సంస్థలతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. అదేవిధంగా నిర్మాణ, ఆటోమొబైల్, పవర్ ప్లాంట్స్, తయారీ, కమ్యూనికేషన్ తదితర ప్రైవేట్ రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. గత రెండు దశాబ్దాలుగా శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతోందని తెలిపారు. పాలిటెక్నిక్ ఇన్‌చార్జ్ వి. ప్రతాప్ రావు మాట్లాడుతూ రాయచోటి పరిసర మండలాల నుంచి విద్యార్థుల రాకపోకలకు కళాశాల బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అదనంగా అర్థమెటిక్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీతో పాటు బాలురు, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జహీర్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ పి.వి. సుధాకర్ రెడ్డి, శక్తి, ఈగల్ టీం సిబ్బంది, కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ. నరేష్, మేనేజ్‌మెంట్ ప్లేస్‌మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్, ఏఐ డీఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి. సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్ ఽ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మనుషుల ప్రాణాలు అంటే వైసిపీ నేతలకు లెక్కలేదు




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ మనుషుల ప్రాణాలంటే వైసీపీ నేతలకు లెక్కలేదు ఎమ్మెల్యే ఎంజీఆర్ కాశీబుగ్గ రోడ్డు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి ఎమ్మెల్యే ఎంజీఆర్ నిందితుడు ఎవరైనా చట్టం ముందు అందరూ సమానమే ఎమ్మెల్యే ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటన అత్యంత విషాదకరమని, ఒక అమాయకుడు ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ ఘటనలో బడుగు, బలహీన వర్గానికి చెందిన దానయ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి న్యాయం జరగడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని, మాజీ మంత్రి కుటుంబ సభ్యుడైనా, సాధారణ పౌరుడైనా ఒకే న్యాయ ప్రమాణాలు అమలుకావాలని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత నిజాలను దాచి పెట్టడం, దర్యాప్తును తప్పుదోవ పట్టించడం, సాక్ష్యాలను ప్రభావితం చేయడం వంటి ఆరోపణలు నిజమైతే అవి క్షమించరాని నేరాలని ఎమ్మెల్యే గారు అన్నారు. కేసును సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, శాస్త్రీయ సాక్ష్యాల ఆధారంగా పారదర్శకంగా విచారించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు కూడా చట్టానికి అతీతులు కారనే సందేశం ఈ కేసు ద్వారా సమాజానికి వెళ్లాలని అన్నారు. ఈ ప్రభుత్వం వ్యక్తులను కాదు, ఆధారాలను చూస్తుందని, హోదాలను కాదు, చట్టాన్ని అమలు చేస్తుందని పేర్కొంటూ, దర్యాప్తును ప్రభావితం చేసిన వారు ఎవరైనా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మీడియా ముఖంగా తెలియజేశారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో మండల నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలి



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** ఆంధ్రప్రదేశ్ లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియ మరో మూడు నెలలు పొడిగించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ. యుగంధర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని కోరారు. ఈరోజు భారత్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో ఏవో రషీద్ కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన ఓట్లు గల్లంతు, ఫారాల విషయంలో ఇబ్బందులు, బిఎల్ వోల అలసత్వం మరియు రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగు చూస్తున్నాయని అన్నారు. ఈనెల 14వ తేదీకి రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవుతుందని ప్రకటించిన సందర్భంలో గడవు ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఇంకా చాలామంది ఓటర్లు వివరాలు నమోదు కాకపోవడం వలన మూడు నెలల గడువు పెంచాలని వారు విన్నవించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగం భారతీయులకు సార్వత్రిక ఓటు హక్కును కల్పించిందని , ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టాక చాలామంది ఓటర్ల లిస్టులో లేకపోవడం గమనార్హమని అన్నారు. మరణించిన ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలస పోయిన వారిని, నకిలీ ఓటర్ ను తొలగించడం ఎస్ ఐ ఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ, వాస్తవం అందుకు భిన్నంగా ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటివరకు చాలాచోట్ల ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని, సరైన సమాచారం అందకపోవడం, సాంకేతిక లోపాల వల్ల చాలామంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఏర్పడిందని, ఎన్యుమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం, క్షేత్రస్థాయిలో ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వలన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చాలా ప్రాంతాలలో బి ఎల్ వో లు ఇళ్లకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం, సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తుందని, అంతేకాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియ దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మరో మూడు నెలల పాటు పొడిగించి, అర్హులైన అందరూ ఓటు హక్కు పొందే విధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టవలసిందిగా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సామ కృష్ణ, ధర్మారావు, ప్రేమ్ సాయి, సతీష్, భరత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

# శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం.

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలం తెంబూరు గ్రామంలో శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 90 మంది కంటి పరీక్షల నిమిత్తం వచ్చారని, వారిలో 71 మందికి ఆపరేషన్లకు సెలెక్ట్ అయ్యి శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెంబూరు సత్యసాయి భక్తులు, మహిళా సేవాదళ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



## కీటక జనిత వ్యాధులపై నిఘా ఉంచాలి

సబ్ యూనిట్ అధికారి జి. జయరామయ్య



**లక్కిరెడ్డిపల్లి జూలై 13 ప్రజా జ్యోతి** లక్కిరెడ్డిపల్లి సీజనల్ (కాలానుగుణ )వ్యాధులపై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో నిఘా ఉంచాలని లక్కిరెడ్డి పల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.జయరామయ్య అన్నారు. సోమవారం స్థానిక మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం పరిధిలో గల 06 పి. హెచ్. సి ల హెల్త్ అసిస్టెంట్ లతో సీసనల్ వ్యాధుల నియంత్రణ పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి జి. జయరామయ్య మాట్లాడుచు ఆరోగ్య కార్యకర్తలు ప్రతీ రోజు తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి లార్వా మరియు జ్వరాల సర్వే లను నిర్దేశించిన ఫార్మేట్ ప్రకారం నిర్వహించాలని, జ్వరపు కేసులను గుర్తించి వారి నుండి రక్త నమూనాలను సేకరించాలని, రోగి పరిస్థితిని బట్టి రెఫెర్ చేయాలని, అనుమానిత జ్వరపీడితులనుండి కూడా సాంపిల్స్ సేకరించి పి.హెచ్. సి లోని ల్యాబ్కు కు పంపాలని మరియు ..ఫ్రైడే డ్రైడే నిక్కచ్చిగా అమలు చెయాలని సూచనలు చేశారు. ఓల్డ్ పెట్రోల్ బంక్ వీధి ఏరియాలో డెంగు వ్యతిరేక మాస ఉత్సవ కార్యక్రమంలో ర్యాలీ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఠికి నీటికి... దారి దొరికినట్టేనా ?



**దువ్వూరు, జులై 13 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలో కర్నూలుకు పోయే రహదారి లో పోలీస్ స్టేషన్ వద్ద నుండి ఆర్ అండ్ బి సరిహద్దులను రోడ్డుకు ఇరువైపులా సోమవారం ఆర్ అండ్ బి,రెవిన్యూ,పంచాయతీ రాజ్ శాఖల అధికారులు కలిసి హద్దులను వెలికితీశారు. ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ కు చెందిన రోడ్డు మార్జిన్ స్థలం వరకు హద్దులను నిర్ణయించి గుర్తులు వేశారు. రెవెన్యూ అధికారులు రాతపూర్వకంగా హద్దుల సంబంధించిన సర్వే రిపోర్ట్ ఆర్ అండ్ బి అధికారులకు పంపిన వెంటనే,నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇప్పుడైనా మురికి నీటి సమస్య తీరుతుందో,లేదోని వేచి చూడకు తప్పదు.

## జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలో కొనసాగాలని సామర్లకోట పంచారామ క్షేత్రం శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి వారికి సతీ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన కాకినాడ జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు



**కాకినాడ జిల్లా సామర్లకోట (ప్రజా జ్యోతి)** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ సోమవారం సామర్లకోట పంచారామ క్షేత్రం శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సందర్భంగా ఎంతో ప్రత్యేకమైన పర్వదినంగా భావించి ఉప ముఖ్యమంత్రివర్యులు ఆరోగ్యం బాగుండాలని అతి త్వరలోనే కోలుకొని ప్రజా జీవితంలో అడుగుపెట్టి సుపరిపాల ప్రజలకు అందించాలని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి అభిషేకం శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే నాయకుడని అన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి వచ్చి రాష్ట్ర అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులు ప్రార్థనలు నిర్వహించడం వారి నాయకుడిపై ఉన్న అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. భగవంతుని కృపతో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని ప్రజల ఆశయాల సాధనలో మళ్లీ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట పట్టణ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్ సరోజ్ వాసు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్ధు భావన్నారాయణ,పిట్ట జానకి రామారావు మంచం సాయిబాబు, అత్తిలి కృష్ణ,పెంకె వెంకటలక్ష్మి, భీమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త అలోక్ సామర్లకోట మండల అధ్యక్షులు పబ్బినిడి ఈశ్వరవు, పెద్దాపురం మండల అధ్యక్షులు శివబాబు, సామర్లకోట మండల యూత్ అధ్యక్షులు మలిరెడ్డి బుచ్చిరాజు, మొటూరు నగేష్, షేక్ సూరజ్,మడగల శ్యామ్ కుమార్,కొప్పుల వాసు, గంట రాంబాబు, గొల్లపల్లి దుర్గారావు,ఆనందాల శీను,తుమ్మల ప్రసాద్, పన్నీర్ వెంకటేశ్వరరావు స్పాట్ చంద్రశేఖర్,జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

**జూలై 15న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపు**




**తాండూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం తాండూరు మండల కార్యదర్శి దాగం రాజారాం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తాండూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి ఉన్న దేశంగా భారత్ ఉన్నప్పటికీ యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుండగా ప్రభుత్వాలు మాత్రం యువత ఆశలతో రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అలాగే తెలంగాణలో కూడా ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీలు అమలు కాలేదని, నోటిఫికేషన్లు ఆలస్యమవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయాలని, కేంద్ర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీస్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని, డీఎస్సీ, గ్రూప్స్, జేఎల్, డీఎల్ తదితర అన్ని శాఖల్లో నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవీపీఎస్ తాండూరు మండల కార్యదర్శి దుర్గం నాన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు బొల్లం రాజేశం, మొగిలి, రాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ కై ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ




**నిజామాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహిస్తున్న "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవనీ" కార్యక్రమాన్నీ పురస్కరించుకొని ఈరోజు మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే హైస్కూల్ నందు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ని అడిషనల్ కలెక్టర్ శ్రీ భుజంగరావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు జులై 13 వ తేదీ ఈ రోజున జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అందజేయడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడుతుందనీ అన్నారు. ప్రధానంగా ఏ లిక పాములు కొంకిపురుగులు, నులిపురుగులు, వల్ల విద్యార్థులలో రక్తహీనత, అలసట, కడుపులో నొప్పి, డయేరియా, డీసెంట్రీ, లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కాబట్టి ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రను బాగా నమిలి చప్పరించాలన్నారు. భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులు శుభ్రత పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోష కాహారము, వ్యక్తిగత పరిశుభ్రత,వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన మొత్తం ఒకటి నుండి 19 సంవత్సరాల విద్యార్థులు 390297 మంది ఉన్నారన్నారు. విద్యార్థులు చేతివేళ్ల గోళ్ల శుభ్రతను పాటించాలన్నారు, అమ్మాయిల్లో రక్తహీనత 12 గ్రాములకు మించి ఉండాలని, ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈరోజు ఆల్బన్ డాజోల్ మాత్రలు తీసుకొని వారు జూలై 20వ తేదీ రోజు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, రీజనల్ కోఆర్డినేటర్ సత్య నాథ రెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రిన్సిపాల్ స్వప్న ,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, , వైద్యాధికారులు డాక్టర్, రాజశ్రీ ,డాక్టర్ అజ్మల్, డాక్టర్ అరవింద్, డిప్యూటీ డెమో దుర్గారావు,డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డి ఈ ఐ సి మేనేజర్ సచిన్, సి హెచ్ ఓ గిరిబాబు, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు

# అమరావతి ఈఎంఎస్ సంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను ఇవ్వడం అభినందనీయం..**

**అమరావతి ఈఎంఎస్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు**



**సూర్యాపేట :** కోదాడ మండలం రెడ్లకుంట గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం సంస్థలోని ఉత్పత్తి విభాగాలు,యంత్రాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కోదాడ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసిన వై. అనంతరావు, వై. కరాళ్ బోస్, డాక్టర్ స్టాలిన్లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమ మరింత అభివృద్ధి చెంది స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులతో సంస్థ మంచి గుర్తింపు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ నిర్వాహకులు చైర్మన్ వై అనంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కారల్ బోస్, సీఈఓ డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కార్యదర్శి, కరస్పాండెంట్ కె. కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, సంస్థ సిబ్బంది, అభిమానులు తదితరులు

## ప్రజావాణికి 156 ఫిర్యాదులు

**నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 156 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్ ఓటర్‌పై బిఎల్‌ఓ లతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే:



**రామడుగు :** గోపాలరావుపేట గ్రామంలో సర్ ఓటర్పై (బిఎల్ఓ) లతో మాజీ శాసనసభ్యులు సుంకే రవి శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రవి శంకర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పైన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని టైం లేనందున ప్రజలకు ఇప్పుడిప్పుడే దీనిపై అవగాహన వస్తున్నందున మరికొంత సమయం పొడిగించాలని గ్రామంలో ఏదైనా ఓటర్ల వివరాలు ఇతర ఇబ్బందులు ఉంటే మా పార్టీ తరఫున మేము నియమించుకున్న బిఎల్ఎ మరియు బిఎల్ ఓ వాళ్లను సమన్వయం చేసుకొని ఏ ఒక్క ప్రజల ఓటు కూడా పోకుండా తొందరగా ఆన్లైన్

## బద్వేల్ టీడీపీకి పూర్వ వైభవం తెస్తా

**- బద్వేల్ టీడీపీ ఇంచార్జ్ యం. సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 13 (ప్రజా జ్యోతి)** బద్వేల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తానని బద్వేల్ టీడీపీ నూతన ఇంచార్జ్, డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బద్వేల్ పట్టణంలోని ఎన్జీవో కాలనీ నందు సోమవారం సాయంత్రం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క నాయకున్ని,కార్యకర్తలను, ప్రజలను కలుపుకొని సమన్వయంతో ముందుకు వెళతానన్నారు. నాపై నమ్మకం ఉంచి బద్వేల్ టిడిపి ఇన్చార్జిగా నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కు ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావులకు ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం

**కూకట్ పల్లి :** ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్ డివిజన్ గ్రీన్ వ్యూ కాలనీలో స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన రమేష్ విస్తృతంగా పర్యటించారు. తాము నివసించేందుకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు రోడ్లు విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు దీనిపై స్పందించిన ఆయన కొద్దిరోజులు వ్యవధి లోనే కాలనీకి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం సర్ పత్రాల పంపిణీ పైన వాటిని పూర్తి చేయడం పైన ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పత్రాన్ని పూర్తి చేసి తిరిగి అధికారులకు అందజేయాలని సూచించారు పార్టీకి చెందిన స్థానిక నాయకులు సైతం సర్ పత్రాలను పూర్తి చేయడంపై ప్రజలకు సహకరించాలని సూచించారు.

## ఎస్ఐఆర్ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం

**రంగారెడ్డి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ఓట్లు పోవ్వివకుండా జాగ్రత్త పడాలి. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేసే విధంగా ఈ కార్యక్రమం వుందని అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకే ఓట్లు తొలగించే డ్రామా ఎస్ఐఆర్. గడపగడపకు తిరిగి వివరాలు సేకరించవలసిన అధికారులు ఒకే చోట ఖీ ఫారంలు పంచుతున్నారు. అధికారులు వచ్చిన సమయంలో ఇంట్లో లేకపోతే వాళ్ళ ఓట్లు తొలగించే పన్నాగం పడుతున్నారు అధికారులు. అధికారులు సైతం కాంగ్రెస్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు . అధికారుల ధోరణి మారకపోతే న్యాయస్థానానికి వెళ్ళి పిర్యాదు చేశాం. బిఆర్ఎస్ కార్యకర్తలు బీఎల్వో లతో కలిసి ఓట్లు తొలగించకుండా వివరాలు సేకరించేలా పనిచేయాలని అన్నారు.

## భయమా..ప్రకాష్ రాజ్ ?

**హైదరాబాద్ :** యూట్యూబర్ రావణ్ దేశద్రోహం, ఉపా చట్టం కింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఉదంతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ పేరు ప్రముఖంగా తెరపైకి రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై పెద్ద ఎత్తున ట్రోలింగ్, ప్రచారం మొదలైంది. దీనిపై ప్రకాష్ రాజ్ నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరంటూ కొత్తగా వీడియో విడుదల చేశారు. తాను మౌనంగా లేనని, జనసైనికులు, కొన్ని ఛానళ్లు, యూట్యూబర్లు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని గమనిస్తున్నానని తెలిపారు. వీటన్నిటికీ దిగజారండి, దిగజారుతూనే ఉండండి అని వ్యాఖ్యానిస్తూ, వారి దిగజారుడుతనాన్ని ప్రపంచం చూస్తోందంటూ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ పైపైన ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నా.. లోపల మాత్రం కేసు తీవ్రత చూసి తీవ్ర ఆందోళనలో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దేశద్రోహం కేసులో ఇరుక్కున్న రావణ్‌తో ప్రకాష్ రాజ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. రావణ్‌తో పాటు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి, ఏపీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యూహాత్మక కుట్రలు చేశారనే ప్రచారం గట్టిగా నడుస్తోంది. గతంలో రావణ్ చేసిన పలు వివాదాస్పద పోస్టులను, వీడియోలను ప్రకాష్ రాజ్ సపోర్ట్ చేస్తూ రీట్వీట్లు చేయడం.. ఇప్పుడు ఈ విచారణ తన దాకా వస్తుందనే భయంతోనే ఆయన ప్రశ్నించే గొంతు అంటూ ముందస్తు రక్షణ కవచం వెతుక్కుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకాష్ రాజ్ కెరీర్ అంతా పరిశీలిస్తే.. ఆయన ఎప్పుడూ సమాజం కోసమో, సామాన్య ప్రజల సమస్యల కోసమో క్షేత్రస్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు లేవనేది బహిరంగ రహస్యం. ఆయన వేసే ప్రశ్నలు కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసేలా, ఆయన వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు ఉపయోగపడేలా మాత్రమే ఉంటాయనే వాదన బలంగా ఉంది. అందుకే ప్రజాసమస్యలపై స్పందించని ఆయన ప్రశ్నల ను సామాన్యులు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈసారి వ్యవహారం కేవలం రాజకీయ విమర్శలతో ఆగిపోయేలా లేదు. ప్రభుత్వ నిఘా వర్గాలు, పోలీసులు ఈ డిజిటల్ కుట్రల వెనుక ఉన్న అసలు లింకులను పక్కా ఆధారాలతో బయటకు తీస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే కాబట్టి, నిజాలు పూర్తిగా నిరూపితమైతే ప్రకాష్ రాజ్ సైతం లీగల్ చిక్కులను, కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి అడుగులు ప్రకాష్ రాజ్ మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. అరెస్ట్ అయిన రావణ్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో లభ్యమైన కీలక డేటా, చాటింగ్ హిస్టరీతో పాటు.. ఈ ఛానల్‌కు ఫండింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గమన అనే మహిళను పోలీసులు త్వరలోనే విచారించనున్నారు. గమన నోటీసుల విచారణలో తేలే అంశాలు, రావణ్ ఫోన్ డాక్యుమెంట్లు క్రోడీకరిస్తే.. ఈ సోషల్ మీడియా నెట్‌వర్క్ వెనుక ప్రకాష్ రాజ్ పాత్ర ఏంటనేది అధికారికంగా బయటపడే అవకాశం ఉంది. తెరవెనుక నడిచిన అసలు కథ స్క్రిప్ట్ బయటకు వస్తే, అది ప్రకాష్ రాజ్ కే సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

## ఆరు రోజుల పాటు కూనారం రోడ్ గేటు మూసివేత

**పెద్దపల్లి :** పెద్దపల్లి రైల్వే యార్డు సమీ పంలోని లెవల్ క్రాసింగ్ నెం.39 వద్ద అత్యవసర ట్రాక్ మరమ్మతుల పనుల కారణంగా నేటి నుండి ఈ నెల 19 సాయంత్రం 7 గంటల వరకు గేట్‌ను రోడ్డును మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ సమయంలో వాహనదారు లు ప్రత్యామ్నాయ మార్గాల ను వినియోగించాలని సూచిం చారు. మరమ్మతుల వల్ల కలిగే అసౌకర్యానికి రైల్వే శాఖ విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రహదారిపైన ఇసుక లారీల పార్కింగ్‌పై కలెక్టర్ కు ఫిర్యాదు.


**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాళేశ్వరం?మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వందలాది ఇసుక లారీలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ వినతిలో పేర్కొన్నారు.



# ‘దండోరా’ దర్శకుడితో సినిమా?

గత కొంతకాలంగా సరైన విజయాలు లేక నిరుత్సాహంలో ఉన్నారు హీరో నితిన్. గత ఏడాది విడుదలైన ‘తమ్ముడు’ కూడా పరాజయంపాలైంది. వరుస ఫెయిల్యూర్స్‌తో సినిమాలకు ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న నితిన్.. ఇటీవలే మూడు సినిమాలకు ఓకే చెప్పిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని తెరకెక్కించబోతున్నారు. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తాడు. ‘దండోరా’ తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగే సినిమా ఇదని సమాచారం. ఇందులో నితిన్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటించబోతున్నది. గ్లామర్ హంగులకు దూరంగా పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

# నాగచైతన్య కొత్త సినిమా?



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ‘బెదురులంక 2012’ చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే ‘మసూద’ దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా ‘మసూద’తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.




# మా అమ్మ భావోద్వేగానికి గురయ్యారు: భాగ్యశ్రీ బోర్సే

“లెనిన్’ సినిమా విజయం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. నేను చేసిన భారతి పాత్ర పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం మర్చిపోలేను. ‘లెనిన్’లో నా నటన పట్ల మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. మా అమ్మగారు నాకు ఫోన్ చేసి, ‘సినిమా చాలా బాగుంది.. నీ నటన కూడా ఎంతో బాగా అనిపించింది’ అన్నారు. అయితే భారతి పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా భావోద్వేగానికి గురయ్యారు. ఎందుకంటే అలాంటి ముగింపును ఏ తల్లి కూడా కోరుకోదు కదా?” అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు. అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం ‘లెనిన్’. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో భారతి పాత్ర పోషించిన భాగ్యశ్రీ బోర్సే చెప్పిన విశేషాలు...

“లెనిన్’ కథని మురళీ కిషోర్‌గారు చెప్పినప్పుడే నా మనసుకు హత్తుకుంది. భారతి పాత్రలో నటనకు మంచి అవకాశం ఉందని అప్పుడే అనిపించింది. ఇప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రను ఇంతగా అభిమానించడం చాలా సంతోషంగా ఉంది. భారతి పాత్ర గురించి అందరూ ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నారు. నాగార్జునగారు నా నటన గురించి మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసలు నాకు సంతోషంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయి. ఋలెనిన్--భారతిల ప్రేమకథే ‘లెనిన్’. అఖిల్, నా పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. భవిష్యత్తులో మహారాణి, యువరాణి వంటి పాత్రలు చేయాలని ఉంది. అలాంటి చిత్రాల విషయంలో రాజమౌళిగారు మాస్టర్. ఏదో ఒక రోజు ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. ‘మా ఇంటి బంగారం’ సినిమాలో సమంతగారు అద్భుతంగా నటించారు. మాలాంటి కొత్త నటీమణులకు ఆమె ఒక దారి చూపించారు. అవకాశం వస్తే అలాంటి మహిళా ప్రధాన పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం శివ కార్తికేయన్ తో తమిళంలో ‘సీయోన్’ సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగు, తమిళ భాషల్లో మరికొన్ని కథలు వింటున్నాను. వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,